veluturu telugu daily

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి నల్గొండ | సోమవారం 19.10.2026

సంపుటి : 9 | సంచిక : 127

www. veluturu.com

## రష్యాపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్

### వెయ్యికి పైగా డ్రోన్లతో భీకర దాడి

- సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో చమురు కేంద్రాలకు నిప్పు
- ఇంధన కేంద్రాలు, సరుకు రవాణా కేంద్రం, సమాచార కేంద్రంపై దాడులు
- ట్రంప్ ఇంధన కాల్పుల విరమణ ప్రకటనకు ఆదిలోనే ఎదురుదెబ్బ
- వారంలో ఉక్రెయిన్ ఇంధన వ్యవస్థపై రష్యా 76 దాడులు చేసిందన్న జెలెన్‌స్కీ

2





## దిగొచ్చిన జేడీ వాన్స్

- హద్దులు దాటానని అంగీకరించిన అమెరికా ఉపాధ్యక్షుడు
- ఇండెంచర్డ్ సర్వెంట్స్ వ్యాఖ్యలపై జేడీ వాన్స్ వివరణ
- హెచ్-1బీ వీసాదారులు కాదు, కంపెనీలు, వీసా విధానమే లక్ష్యమని వెల్లడి

**మిచిగాన్, వెలుతురు అక్టోబర్ 18:**

హెచ్-1బీ వీసాదారులను 'ఇండెంచర్డ్ సర్వెంట్స్' (ఒప్పంద బానిసలు)గా అభివర్ణించడంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దిగొచ్చారు. తన వ్యాఖ్యల్లో సరైన పదజాలం ఉపయోగించలేకపోయానని అంగీకరించారు. హెచ్-1బీ వీసాదారులను విమర్శించడం తన ఉద్దేశం కాదని, వారిని ఆధారంగా చేసుకుని అధికారం చెలాయిస్తున్న అమెరికా కంపెనీలు, వీసా విధానాన్ని లక్ష్యంగా చేసుకుని మాట్లాడానని స్పష్టం చేశారు. సీబీఎస్ నిర్వహించిన టౌన్‌హాల్ కార్యక్రమంలో మాట్లాడిన జేడీ వాన్స్, తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు.

'నా ప్రసంగంలో పదజాలం సరిగ్గా లేకపోతే అందుకు నేనే బాధ్యత వహిస్తా. కొందరు - మిగతా 2 లో.. ▸



## అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు

### రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన బతుకమ్మ వేడుకలు

రాష్ట్ర వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను ఒక్క చోట చేర్చి మహిళలు, చిన్నారులు బతుకమ్మ ఆటలు ఆడుతూ సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేసి అక్కడే తీసుకెళ్లిన సద్దులను కడుపునిండా తిని ఇళ్లకు చేరుకున్నారు. కాగా హుస్సేన్ సాగర్ తీరాన 700 బతుకమ్మలతో ఆడపడుచులు సందడి చేశారు. ఈ వేడుకల్లో సినీ నటి రష్మిక, విజయ్ దేవర కొండ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

\- హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 18:

### హుస్సేన్‌సాగర్ తీరాన పూల సంబురం

- 700 బతుకమ్మలతో ఆడపడుచుల కోలాహలం
- 700 మంది కళాకారులతో 30 కళారూపాల ప్రదర్శన
- ప్రత్యేక ఆకర్షణగా విజయ్ దేవరకొండ, రష్మిక

(వివరాలు లోపలి పేజీల్లో)




# బియ్యం.. భయ్యం..!!

## సామాన్యుడి నెత్తిన ధరల భారం

- కిలో రూ.80 దాటిన సన్నబియ్యం
- నెల వ్యవధిలో బస్తాపై రూ.350 పెరుగుదల
- రైతు నుంచి వినియోగదారుడి వరకు మధ్యవర్తులదే పైచేయి?
- నిల్వలు, ధరల వ్యత్యాసంపై నిఘా పెంచాల్సిన అవసరం

11

తెలంగాణలో బియ్యం ధరలు సామాన్యుడికి భారంగా మారుతున్నాయి. పేద, మధ్యతరగతి కుటుంబాల నెలవారీ ఖర్చుల్లో అత్యంత కీలకమైన బియ్యం ధరలు ఇటీవల గణనీయంగా పెరగడంతో ఇంటి బడ్జెట్ తలకిందులవుతోంది. ముఖ్యంగా సన్నబియ్యం ధరలు చుక్కలనంటుతున్నాయి. అక్టోబర్ 9న వెలువడిన మార్కెట్ కథనాల ప్రకారం గతంలో కిలో రూ.70 పలికిన సన్నబియ్యం రూ.80 నుంచి రూ.82కు చేరింది. రూ.1,800 వరకు లభించిన 25 కిలోల బస్తా రూ.2,150కు పెరిగింది. అంటే ఒక్క బస్తాపైనే రూ.350 అదనపు భారం పడుతోంది. మరోవైపు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ ధరల పర్యవేక్షణ గణాంకాల ప్రకారం అక్టోబర్ 10న తెలంగాణలో సాధారణ బియ్యం సగటు చిల్లర ధర కిలో రూ.70గా నమోదైంది. రకం, నాణ్యత, ప్రాంతాన్ని బట్టి ధరల్లో వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది. - హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 18

### నిల్వలపై నిఘా ఎంత?

ధాన్యం సమృద్ధిగా ఉన్నప్పటికీ వినియోగదారులకు అందుబాటు ధరల్లో బియ్యం లభించకపోతే సరఫరా వ్యవస్థ పనితీరును ప్రశ్నించాల్సిందే. మిల్లర్లు, టోకు వ్యాపారులు, గోదాముల నిర్వాహకుల వద్ద ఉన్న నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించడం ద్వారా కృత్రిమ కొరతకు అవకాశం లేకుండా చూడవచ్చు. నిత్యావసర వస్తువుల అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్ విక్రయాలు, సరఫరా మళ్లింపులను నిరోధించేందుకు నిత్యావసర వస్తువుల చట్టం-1955 కింద చర్యలు తీసుకునే అధికారం పౌరసరఫరాల శాఖకు ఉంది. జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశాలు నిర్వహించడం, అవసరమైతే బహిరంగ మార్కెట్‌లో జోక్యం చేసుకోవడం కూడా శాఖ బాధ్యతల్లో భాగమే.



2

## పండుగపూట చార్జీల మోత!

- పల్లెబాట పట్టిన ప్రజలకు ప్రయాణ కష్టాలు
- ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో అదనపు భారం.. ప్రైవేటు వాహనాల్లో వేలకు వేలు వసూలు
- సొంతూళ్లకు వెళ్లాలంటే అప్పులు చేయాల్సిన పరిస్థితి.. ప్రయాణికుల జేబులకు చిల్లు

హైదరాబాద్ నుంచి తెలంగాణలోని సొంతూళ్లకు బయలుదేరే ప్రజలకు పండుగ ప్రయాణం భారంగా మారుతోంది. నగరంలో ఉపాధి, ఉద్యోగాలు, చదువుల కోసం స్థిరపడిన వేలాది కుటుంబాలు పండుగలు, వరుస సెలవులు వచ్చినప్పుడు స్వగ్రామాల బాట పడుతుంటాయి. ఈ రద్దీని ఆసరాగా చేసుకుని ప్రయాణ ఖర్చులు పెరగడం సామాన్యులకు భారంగా పరిణమిస్తోంది. ఒకవైపు ప్రత్యేక బస్సుల చార్జీల భారం, మరోవైపు ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాల అధిక వసూళ్లతో సొంతూరికి వెళ్లడమే ఖరీదైన వ్యవహారంగా మారుతోందన్న ఆవేదన ప్రయాణికుల్లో వ్యక్తమవుతోంది. - హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 18



## భక్తులపైకి దూసుకెళ్లిన మృత్యుశకటం!

- గ్వాలియర్‌లో ఘోర ప్రమాదం.. 15 మంది మృతి
- 33 మందికి గాయాలు.. పలువురి పరిస్థితి విషమం
- పోలీసుల అడ్డంకులు ఛేదించుకుని భక్తులపైకి దూసుకెళ్లిన ట్రక్కు
- మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారం ప్రకటించిన మధ్యప్రదేశ్ ప్రభుత్వం

11

# భారత్‌లో టీచర్లు కావలెను..!

### సింగిల్ టీచర్తోనే లక్ష స్కూల్స్

- 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా మరో 5 కోట్ల మంది ఉపాధ్యాయులు అవసరం : యునెస్కో

### 11 లక్షలకుపైగా ఉపాధ్యాయుల కొరత

**న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 18:**

ప్రపంచవ్యాప్తంగా నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయుల కొరత ప్రధాన అడ్డంకిగా మారుతోంది. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రకారం 2030 నాటికి పిల్లలందరికీ ప్రాథమిక, మాధ్యమిక విద్యను అందించడం, తక్కువ ఖర్చులో ఉన్నత విద్యను కల్పించడం, ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను అందించాలి. అయితే యునెస్కో ఇటీవల విడుదల చేసిన 'గ్లోబల్ రిపోర్ట్ ఆన్ టీచర్స్' నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఉపాధ్యాయుల కొరత ఈ విద్యావ్యవస్థను కుదిపేస్తోంది. ప్రీ ప్రైమరీ నుంచి సెకండరీ స్థాయి వరకు ప్రతి చిన్నారికి మెరుగైన విద్య అందించాలంటే




2030 నాటికి మరో 5 కోట్ల మంది ఉపాధ్యాయులు అవసరం అని నివేదికలో వెల్లడించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సుమారు 10.7 కోట్ల మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, ప్రతి ఇద్దరు ఉపాధ్యాయులకు అదనంగా మరో ఉపాధ్యాయుడు అవసరమయ్యే పరిస్థితి ఉందని నివేదిక పేర్కొంది. - మిగతా 2 లో.. ▸



## తాగునీరు వృథా చేస్తే ఊరుకోం

- హైదరాబాద్ జలమండలి స్పష్టం
- జూబ్లీహిల్స్ పబ్‌కు రూ.20 వేల జరిమానా
- నీటిని దుర్వినియోగం చేసే వారిపై ఉక్కుపాదం

11

## హైదరాబాద్ స్థిరాస్తి జోరుకు బ్రేక్!

- సెప్టెంబర్‌లో 15 శాతం తగ్గిన గృహాల రిజిస్ట్రేషన్లు
- బడ్జెట్, మధ్యశ్రేణి ఇళ్ల కొనుగోళ్లలో క్షీణత
- లావాదేవీల విలువకు ఖరీదైన ఇళ్లే ఆసరా

11





## మాజీ ముఖ్యమంత్రి టి. అంజయ్యకు మహేష్ కుమార్ గౌడ్ ఘన నివాళి

**కార్మికుడి స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన అంజయ్య జీవితం స్ఫూర్తిదాయకం: మహేష్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 18:**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి టి. అంజయ్య 40వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని లుంబిని పార్క్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, సామాన్య కార్మికుడిగా తన జీవితాన్ని ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి అత్యున్నత పదవిని చేపట్టిన టి. అంజయ్య జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై, వారి సమస్యలను తెలుసుకుంటూ నిరంతరం ప్రజాసేవకు అంకితమైన నాయకుడిగా అంజయ్య గుర్తింపు పొందారని అన్నారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మనసును చూరగొన్న నాయకుడిగా అంజయ్య నిలిచారని పేర్కొన్నారు. పేదల పెన్నిధిగా పేరుపొందిన ఆయన, ప్రజల సమస్యలను ఓపికగా వింటూ, విమర్శలను సైతం సహనంతో స్వీకరించే వ్యక్తిత్వాన్ని కలిగి ఉన్నారని కొనియాడారు.

నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ సామాన్య ప్రజల సంక్షేమం కోసం పనిచేసిన అంజయ్య జీవితం నేటి తరం నాయకులకు మార్గదర్శకమని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రజలతో మమేకమై సేవ చేయడం, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వంటి విలువలను ఆయన జీవితం నుంచి ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, వి. హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తదితరులు పాల్గొని టి. అంజయ్యకు నివాళులర్పించారు.

# పండుగపూట చార్జీల మోత!







- పల్లెబాట పట్టిన ప్రజలకు ప్రయాణ కష్టాలు
- ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో అదనపు భారం.. ప్రైవేటు వాహనాల్లో వేలకు వేలు వసూలు
- సొంతూళ్లకు వెళ్లాలంటే అప్పులు చేయాల్సిన పరిస్థితి.. ప్రయాణికుల జేబులకు చిల్లు

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 18**

హైదరాబాద్ నుంచి తెలంగాణలోని సొంతూళ్లకు బయలుదేరే ప్రజలకు పండుగ ప్రయాణం భారంగా మారుతోంది. నగరంలో ఉపాధి, ఉద్యోగాలు, చదువుల కోసం స్థిరపడిన వేలాది కుటుంబాలు పండుగలు, వరుస సెలవులు వచ్చినప్పుడు స్వగ్రామాల బాట పడుతుంటాయి. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లాలైన కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ ప్రాంతాలతో పాటు మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి, జగిత్యాల, మంచిర్యాల తదితర ప్రాంతాలకు పెద్ద ఎత్తున ప్రయాణాలు సాగుతాయి. ఈ రద్దీని ఆసరాగా చేసుకుని ప్రయాణ ఖర్చులు పెరగడం సామాన్యులకు భారంగా పరిణమిస్తోంది. ఒకవైపు ప్రత్యేక బస్సుల చార్జీల భారం, మరోవైపు ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాల అధిక వసూళ్లతో సొంతూరికి వెళ్లడమే ఖరీదైన వ్యవహారంగా మారుతోందన్న ఆవేదన ప్రయాణికుల్లో వ్యక్తమవుతోంది.

### ప్రత్యేక బస్సుల పేరుతో అదనపు వసూళ్లు

దసరా ప్రయాణాల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ప్రకటించింది. అయితే రద్దీ రోజుల్లో నడిపే ప్రత్యేక బస్సులకు సాధారణ చార్జీల కంటే 50 శాతం వరకు అదనంగా వసూలు చేసేందుకు అనుమతి ఉంది. ఈ నెల 9, 10, 16, 17, 25, 26 తేదీల్లో ప్రత్యేక చార్జీలు వర్తిస్తాయని అధికారులు వెల్లడించారు. సాధారణ బస్సుల్లో సాధారణ చార్జీలే ఉంటాయని స్పష్టం చేశారు. అయితే రద్దీ సమయంలో సాధారణ బస్సుల్లో సీట్లు దొరకకపోవడం, ప్రత్యేక బస్సుల కోసం నిరీక్షించాల్సి రావడం ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తోంది. సాధారణంగా రూ.300 ఉండే టికెట్ ధర ప్రత్యేక బస్సులో రూ.450కు చేరడంతో కుటుంబ సమేతంగా వెళ్లేవారిపై అదనపు భారం పడుతోంది. సొంతూరికి వెళ్లాలంటే భార్యాభర్తలు, పిల్లలతో కలిపి ఒక కుటుంబం టికెట్లకే గణనీయమైన మొత్తం వెచ్చించాల్సి వస్తోంది.

### ప్రైవేటు వాహనాల్లో రెట్టింపు.. కొన్నిచోట్ల అంతకంటే ఎక్కువ

ఆర్టీసీ చార్జీల పెంపు ఒకవైపు ఉంటే, ప్రైవేటు ట్రావెల్స్ వసూళ్లు మరోవైపు ప్రయాణికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కూకట్‌పల్లి, అమీర్‌పేట, సంజీవరెడ్డినగర్ తదితర ప్రాంతాల నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రైవేటు బస్సుల్లో డిమాండ్‌కు అనుగుణంగా టికెట్ ధరలు పెరుగుతున్నాయనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లే ఏసీ స్లీపర్ బస్సులో సాధారణ రోజుల్లో రూ.580 నుంచి రూ.700 మధ్య ఉండే టికెట్ ధర అక్టోబర్ 9న కొన్ని సేవల్లో రూ.1,700 వరకు చేరినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. ఇది సాధారణ ధరతో పోలిస్తే రెండింతలకుపైగా ఉంటుంది.

### బస్టాండ్లలో నిరీక్షణ.. రహదారులపై రద్దీ..

హైదరాబాద్‌లోని మహాత్మా గాంధీ బస్‌స్టేషన్ (ఎంజీబీఎస్), జూబ్లీ బస్‌స్టేషన్ (జేబీఎస్) ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. బస్సుల కోసం గంట నుంచి గంటన్నర వరకు వేచి ఉండాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేసినట్లు అక్టోబర్ 16, 17 తేదీల వార్తా కథనాలు వెల్లడించాయి. రద్దీకి అనుగుణంగా బస్సులు అందుబాటులో లేకపోవడంతో సీట్ల కోసం ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు సొంత వాహనాలు, ప్రైవేటు బస్సుల్లో ప్రయాణాలు పెరగడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కూడా అధికమైంది. చౌటుప్పల్ వద్ద నిర్మాణ పనులు, సర్వీసు రోడ్లపై ఒత్తిడి కారణంగా వాహనాలు నెమ్మదిగా కదిలాయి. కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద కూడా రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి.



## హుస్సేన్‌సాగర్ తీరాన పూల సంబురం

- 700 బతుకమ్మలతో ఆడపడుచుల కోలాహలం
- 700 మంది కళాకారులతో 30 కళారూపాల ప్రదర్శన
- ప్రత్యేక ఆకర్షణగా విజయ్ దేవరకొండ, రష్మిక

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 18:**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ సంబురాలు హుస్సేన్‌సాగర్ తీరాన అంబరాన్నంటాయి. రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన వేడుకల్లో 700 బతుకమ్మలతో ఆడపడుచులు సందడి చేశారు. 700 మంది కళాకారులు ప్రదర్శించిన 30 జానపద కళారూపాలు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటాయి. అమరవీరుల స్థూపం నుంచి మంత్రి సీతక్క మహిళలు, కళాకారులతో కలిసి బతుకమ్మలను ఊరేగింపుగా ప్రధాన వేదిక వద్దకు తీసుకొచ్చారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు, మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క వేడుకల్లో పాల్గొన్నారు. ప్రకృతిని, చెరువులను, పంట పొలాలను పరిరక్షించుకోవాలనే సందేశాన్ని బతుకమ్మ పండుగ చాటుతుందని సీతక్క పేర్కొన్నారు. ఆరోగ్యం, ఆనందం, అనుబంధాలను పంచే ఈ సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఆడబిడ్డను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జలవనరులను సంరక్షించుకోవాలని గవర్నర్ సూచించారు. తెలంగాణ పండుగలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి జూపల్లి తెలిపారు. వేడుకల్లో సినీ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తెలంగాణ కోడలిగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని రష్మిక ఆనందం వ్యక్తం చేశారు.





# రష్యాపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్

**వెయ్యికి పైగా డ్రోన్లతో భీకర దాడి**

- సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో చమురు కేంద్రాలకు నిప్పు
- ఇంధన కేంద్రాలు, సరుకు రవాణా కేంద్రం, సమాచార కేంద్రంపై దాడులు
- ట్రంప్ ఇంధన కాల్పుల విరమణ ప్రకటనకు ఆదిలోనే ఎదురుదెబ్బ
- వారంలో ఉక్రెయిన్ ఇంధన వ్యవస్థపై రష్యా 76 దాడులు చేసిందన్న జెలెన్‌స్కీ



**మాస్కో, వెలుతురు, అక్టోబర్ 18:**

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చింది. ఉక్రెయిన్ ఏకకాలంలో వెయ్యికి పైగా మానవరహిత వైమానిక వాహనాలతో (డ్రోన్లు) రష్యాపై భారీ దాడులకు దిగింది. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ దాడుల్లో రష్యాలోని కీలక చమురు, ఇంధన మౌలిక సదుపాయాలు లక్ష్యంగా మారాయి. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని పీటర్స్‌బర్గ్ చమురు టెర్మినల్, రూచి చమురు నిల్వ కేంద్రంలో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడ్డారని స్థానిక అధికారులు వెల్లడించారు. రష్యా రక్షణ శాఖ మాత్రం తమ వైమానిక రక్షణ వ్యవస్థలు 1,015 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేసినట్లు ప్రకటించింది. ఈ దాడి రష్యాలో ఇటీవలి కాలంలో జరిగిన అతిపెద్ద వైమానిక దాడుల్లో ఒకటిగా నిలిచింది.

### చమురు కేంద్రాలే లక్ష్యంగా..

సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని చమురు ఎగుమతి టెర్మినల్, రూచి చమురు నిల్వ కేంద్రంతోపాటు పారిశ్రామిక గిడ్డంగులపైనా డ్రోన్లు దాడి చేశాయి. రష్యాకు చెందిన ఓజోన్ సరుకు రవాణా కేంద్రంలో అగ్నిప్రమాదం సంభవించగా, వీకే సంస్థకు చెందిన సమాచార కేంద్రంపైనా దాడి జరిగినట్లు సంబంధిత సంస్థలు వెల్లడించాయి. పలు నివాస భవనాలు, ఇళ్లు కూడా దెబ్బతిన్నాయని స్థానిక అధికారులు తెలిపారు. దాడుల నేపథ్యంలో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని పుల్కోవో విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భద్రతా కారణాలతో విమానాశ్రయ కార్యకలాపాలపై ఆంక్షలు విధించారు. లెనిన్‌గ్రాడ్ ప్రాంతంలో సుమారు 20 వేల మంది విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు సమాచారం. రష్యాలోని పలు ప్రాంతాలతోపాటు ఆక్రమిత క్రిమియా, నల్ల సముద్ర ప్రాంతంలోనూ డ్రోన్లను అడ్డుకున్నట్లు రష్యా రక్షణ శాఖ పేర్కొంది. అయితే, కూల్చివేసిన డ్రోన్ల సంఖ్యపై రష్యా ప్రకటించిన వివరాలను స్వతంత్రంగా నిర్ధారించడం సాధ్యం కాలేదు.

### కాల్పుల విరమణకు తూట్లు?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ఇంధన రంగంపై దాడుల నిలిపివేత పిలుపు అమలుపై తాజా పరిణామాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు నిలిపివేయాలని ట్రంప్ అక్టోబర్ 11న ప్రకటించినప్పటికీ, ఆ తర్వాత కూడా రష్యా తమ దేశంలోని ఇంధన కేంద్రాలపై దాడులు కొనసాగించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ఆరోపించారు. ఆ ప్రకటన వెలువడిన వారం రోజుల్లోనే ఉక్రెయిన్ ఇంధన, చమురు, సహజ వాయువు రంగాలపై రష్యా 76 సార్లు దాడులు చేసిందని ఆయన తెలిపారు. ఒక్క వారంలోనే రష్యా దాదాపు 2,700 దాడి డ్రోన్లు, 1,700 వైమానిక బాంబులు, 66 క్షిపణులను ప్రయోగించిందని ఆరోపించారు. విద్యుత్ వ్యవస్థను దెబ్బతీసి దేశవ్యాప్తంగా అంధకారం సృష్టించేందుకు మాస్కో ప్రయత్నిస్తోందని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మండిపడ్డారు. ఆంక్షల సడలింపులు, ఒప్పందాలకు అనుగుణంగా రష్యా ఎలాంటి సానుకూల చర్యలూ తీసుకోవడం లేదన్న విషయాన్ని అమెరికా గుర్తించాలని కోరారు.

### జపోరిజియాపై రష్యా దాడి

మరోవైపు ఉక్రెయిన్‌లోని జపోరిజియాపై రష్యా జరిపిన దాడుల్లో ఓ మహిళ మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. వారిలో ఆరేళ్ల బాలిక కూడా ఉన్నట్లు స్థానిక అధికారులు తెలిపారు. నివాస భవనాలు, వాహనాలు, విద్యాసంస్థకు నష్టం వాటిల్లినట్లు వెల్లడించారు. ఉక్రెయిన్‌లోని విద్యుత్ కేంద్రాలు, ఇతర కీలక మౌలిక సదుపాయాలపై రష్యా దాడులు కొనసాగుతుండటంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. రష్యా చమురు మౌలిక సదుపాయాలపై ఉక్రెయిన్ దాడులను ట్రంప్ విమర్శిస్తుండగా, రష్యా దాడులకు ప్రతిస్పందనగానే తాము చర్యలు తీసుకుంటున్నామని కీవ్ చెబుతోంది. దీంతో యుద్ధాన్ని నిలిపివేసేందుకు జరుగుతున్న దౌత్య ప్రయత్నాలకు మరోసారి ఆటంకం ఏర్పడే పరిస్థితి కనిపిస్తోంది.

## దిగొచ్చిన జేడీ వాన్స్..



**(మొదటిపేజీ తరువాయి)**

హెచ్-1బీ వీసాదారుల గురించి చేసిన వ్యాఖ్యలను మొత్తం వీసాదారులందరికీ వర్తింపజేయకూడదు. అమెరికాలో ఉద్యోగం చేసేందుకు హెచ్-1బీ వీసాపై వచ్చే వ్యక్తులకు, ఆ వీసా వారి అక్కడి జీవితానికి కీలక ఆధారంగా మారుతుంది. యజమానితో విభేదించినా, తమ హక్కుల కోసం మాట్లాడినా ఉద్యోగం కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఉద్యోగం పోతే అమెరికాలో ఉండే అవకాశం కూడా కోల్పోయి స్వదేశానికి తిరిగి వెళ్లాల్సి రావచ్చు. ఈ పరిస్థితి ఉద్యోగులపై యజమానులకు అధికారం కల్పిస్తోంది. హెచ్-1బీ వీసాదారులను 'ఒప్పంద బానిసలు'గా మార్చే పరిస్థితులకు కారణమవుతున్న కంపెనీలు, వీసా వ్యవస్థపైనే నా విమర్శలు' అని జేడీ వాన్స్ తెలిపారు.




# భారత్‌లో టీచర్లు కావలెను..!

**(మొదటిపేజీ తరువాయి)**

### ఉపాధ్యాయుల నియామకానికి ఏటా రూ.10.14 లక్షల కోట్లు

ఉపాధ్యాయుల కొరతను అధిగమించడానికి కొత్త నియామకాలు చేపట్టడం, ఖాళీలను భర్తీ చేయడం, వేతనాలు చెల్లించడం వంటి వాటికి భారీగా నిధులు అవసరం అవుతాయని యునెస్కో నివేదిక తెలిపింది. 2030 నాటికి విద్య లక్ష్యాల్ని చేరుకోవాలంటే ప్రపంచవ్యాప్తంగా ఏటా సుమారు రూ. 10.14 లక్షల కోట్ల నిధులు అవసరం అని అంచనా వేసింది. ఉపాధ్యాయుల కొరత కారణంగా ప్రస్తుతం ఆ వృత్తిలో ఉన్న వారిపై పనిభారం పెరుగుతోంది. దీని వల్ల విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ తగ్గడం, బోధనలో నాణ్యత దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి.

పేద దేశాలు, ముఖ్యంగా సబ్- సహారా ఆఫ్రికా ప్రాంతంలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని యునెస్కో నివేదిక వెల్లడించింది. నైజీరియా, ఘనా, కాంగో రిపబ్లిక్, కామెరూన్, కెన్యా, జింబాబ్వే, మొజాంబిక్, జాంబియా వంటి దేశాలతో కూడిన సబ్ సహారా ఆఫ్రికా ప్రాంతంలో ప్రాథమిక విద్యకు 2030 నాటికి అత్యధికంగా 43.91 లక్షల మంది ఉపాధ్యాయులు అవసరం అవుతారని అంచనా వేసింది. ఇంకా మయన్మార్, ఇండోనేసియా, మలేసియా వంటి దేశాలు ఉన్న ఆగ్నేయాసియా ప్రాంతంలో మరో 30.50 లక్షల మంది ఉపాధ్యాయులు అవసరమని పేర్కొంది.

### సెకండరీ ఎడ్యుకేషన్‌కు 3.11 కోట్ల మంది కొత్త టీచర్లు

9, 10 తరగతుల విద్యార్థులకు మెరుగైన విద్య అందించడానికి ప్రపంచవ్యాప్తంగా 2030 నాటికి సుమారు 3.11 కోట్ల మంది కొత్త ఉపాధ్యాయులు అవసరమవుతారని నివేదిక తెలిపింది. ఈ సెకండరీ విద్యకు సంబంధించి సబ్ సహారా ఆఫ్రికా దేశాలకు 1.06 కోట్ల మందికిపైగా ఉపాధ్యాయులు అవసరం. భారత్‌తో పాటు ఇతర దేశాలు ఉన్న దక్షిణాసియాకు 67.16 లక్షల మంది, మధ్య ఆసియాకు 6.51 లక్షల మంది కొత్త ఉపాధ్యాయులు అవసరం అని అంచనా వేసింది. కొత్తగా నియమించాల్సిన ఉపాధ్యాయుల్లో 58 శాతం మంది ఇప్పటికే వృత్తిలో ఉన్న వారు ఉద్యోగాలు వదిలి వెళ్లడం వల్ల ఏర్పడే ఖాళీలను భర్తీ చేసేందుకే అవసరం అవుతాయని యునెస్కో తెలిపింది. తక్కువ వేతనాలు, అధిక పనిభారం, వృత్తిపరంగా తగినంత గౌరవం లేకపోవడం వంటి అంశాలు ఉపాధ్యాయులు ఉద్యోగాలు వదిలివెళ్లడానికి కారణాలుగా నివేదిక ప్రస్తావించింది. 2024లో ఒక సర్వే ప్రకారం ప్రపంచంలోని 75 శాతం దేశాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో 40 శాతం కంటే తక్కువ మంది మాత్రమే తమ వృత్తికి సమాజంలో గౌరవం ఉందని భావిస్తున్నారు. వృత్తికి గౌరవం లభిస్తున్నప్పుడు ఉపాధ్యాయులు వచ్చే ఐదేళ్లలో ఉద్యోగాన్ని వదిలే అవకాశం 10 శాతానికిపైగా తగ్గుతుందని నివేదిక పేర్కొంది. వివిధ దేశాల్లో ఉపాధ్యాయులకు అందుతున్న నెలవారీ వేతనాల్ని కూడా యునెస్కో రిపోర్ట్ పోల్చింది. 2015 డాలర్ విలువ ఆధారంగా, 2023 గణాంకాల ప్రకారం ఖతార్‌లో ఉపాధ్యాయులకు నెల జీతం సుమారు రూ. 97,164 గా ఉంది. నేపాల్‌లో ఇది రూ. 26321 గా ఉంది. భారత్‌కు సంబంధించి 2019 డేటా ప్రకారం ఉపాధ్యాయుల సగటు నెల వేతనం రూ. 25,232 గా ఉంది. ఇక్కడ కూడా 40 శాతం దేశాల్లో ఉపాధ్యాయులకు వారి అర్హతలకు తగిన వేతనాలు అందట్లేదని నివేదిక గుర్తించింది.

### రాష్ట్రాలవారీగా అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో..

భారత్‌లోని స్కూళ్లలో ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు 11 లక్షలకుపైగా ఉపాధ్యాయుల కొరత ఉందని యునెస్కో గత నివేదిక తెలిపింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని తెలిపింది. యూపీ, మధ్యప్రదేశ్, బిహార్, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల్లో టీచర్ల కొరత ఎక్కువగా ఉన్నట్లు వివరించింది. భారత్‌లో ఉపాధ్యాయుల కొరతకు మరో ఉదాహరణ సింగిల్ టీచర్ స్కూల్స్. యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ గణాంకాల ప్రకారం దేశంలో సుమారు లక్ష పాఠశాలలు ఒక్క టీచర్‌తోనే పనిచేస్తున్నాయి. రాష్ట్రాల వారీగా చూస్తే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో 16357 సింగిల్ టీచర్ స్కూల్స్ ఉన్నాయి. ఝార్ఖండ్‌లో 9827, మహారాష్ట్రలో 9269,కర్ణాటకలో 8042పాఠశాలల్లో ఒక్కొక్కరు చొప్పునే ఉపాధ్యాయులు ఉన్నారు.



## సచివాలయంలో
# మంత్రి వాకిటి ప్రత్యేక పూజలు

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 18 :** దసరా, సద్దుల బతుకమ్మ పండుగలను పురస్కరించుకుని మంత్రి వాకిటి శ్రీహరి సచివాలయంలోని తన చాంబర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగతో పాటు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రజల జీవితాల్లో ఆనందం, శాంతి, సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు బతుకమ్మ, దసరా పండుగలు ప్రతీకలుగా నిలుస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్
# 2026 అవార్డుల ప్రదానోత్సవం

హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 18: తెలంగాణ ఫిల్మ్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్(టీజీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శిల్ప కళావేదికలో జరిగిన బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ అవార్డుల ప్రదానోత్సవానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లఘుచిత్రాలు, బతుకమ్మ పాటలు, జానపదగీతాలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, ఆర్టికల్స్ విభాగాల కింద దర్శకుడు హరీష్ శంకర్ నేతృత్వంలోని జ్యూరీ ఎంపిక చేసిన మొత్తం 29మంది విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ మహిళలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. యువతలో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమం వర్ధమాన చిత్రనిర్మాతలకు తమ ప్రతిభను చాటుకునేందుకు గొప్ప వేదికగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ పోటీలో సుమారు 2,600కు పైగా ఎంట్రీలు రావడం తెలంగాణ యువతలోని సృజనాత్మక శక్తికి నిదర్శనమన్నారు. తెలుగు సినీ పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, హైదరాబాద్‌ను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ చలనచిత్ర నిర్మాణ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సినిమా అనేది కేవలం వినోద సాధనం మాత్రమే కాదని, సమాజంలో మార్పు తీసుకురాగల శక్తివంతమైన మాధ్యమమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, సూపర్ ఎల్ నినో ప్రభావాలు, నీటి సంరక్షణ వంటి కీలక అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా యువ చిత్రనిర్మాతలు తమ సృజనాత్మకతను వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో






విద్యనభ్యసించిన కళాభిమానిగా సృజనాత్మక రంగాల అభివృద్ధిపై ప్రత్యేక ఆసక్తి కనబరుస్తారని తెలిపారు. యువ కళాకారులను ప్రోత్సహించడం, వారికి తగిన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యతల్లో భాగమని అన్నారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి చలనచిత్ర నిర్మాణ సంస్థలు, స్టూడియోలను ఆకర్షించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, తద్వారా నగరానికి ప్రపంచ సినిమా రంగంలో మరింత గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణలో ఉన్న అపారమైన ప్రతిభ, సాంకేతిక సామర్థ్యం, సృజనాత్మక వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి సినిమా కేంద్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వివరించారు. అనంతరం "ప్రజా పాలనలో నవశకం" పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసిన రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజును, బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ బృందాన్ని, టీజీఎఫ్‌డీసీ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, టీజీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, కార్పొరేషన్ ఛైర్మన్లు శ్రీనివాస్ రెడ్డి, వెన్నెల గద్దర్, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజు, టీజీఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. ముకుంద రెడ్డి, ఎఫ్‌డీసీ ఈడీ కిషోర్ బాబు, బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా.మామిడి హరికృష్ణ, నటి అనుపమ పరమేశ్వరన్, సీనియర్ నటుడు నరేష్, జాతీయ అవార్డు గ్రహీత శ్యామ్ కాసర్ల, పీజీ విందా, రచ్చ రవి, విమలక్క, అంతడుపుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లఘుచిత్రాల విభాగం
- ప్రథమ బహుమతి: 'యక్షగానం' -- రామ్ తలైవి (రూ.3 లక్షలు)
- ద్వితీయ బహుమతి: 'నా ఇంటి బతుకమ్మ' -- అభివన్ సందబోయిన (రూ.2 లక్షలు)
- తృతీయ బహుమతి: 'ఇల్లు వెలుగు' -- ప్రభువన్ రాజ్ (రూ.1 లక్ష)

బతుకమ్మ పాటల విభాగం
- ప్రథమ బహుమతి: 'బతుకమ్మ పాట 2026' -- వరం (రూ.3 లక్షలు)
- ద్వితీయ బహుమతి: 'తలెత్తుకుంది బతుకమ్మ' -- అశ్విని రాథోడ్ (రూ.2 లక్షలు)
- తృతీయ బహుమతి: 'బజ్జి బతుకమ్మ' -- మనీషా పటేల్ దొడ్లే (రూ.1 లక్ష)

జానపద గీతాల విభాగం
- ప్రథమ బహుమతి: 'వన్ రాంగ్ స్టెప్' -- డా. కుమారస్వామి (రూ.3 లక్షలు)
- ద్వితీయ బహుమతి: 'అమ్మ నవ్వింది' -- శ్రీను ముదిరాజ్ (రూ.2 లక్షలు)
- తృతీయ బహుమతి: 'ఇది మాయేనా' -- వంశీ చారి (రూ.1 లక్ష)

వ్యాసాల విభాగం
- ప్రథమ బహుమతి: 'వెయ్యి రోజుల వెలుగు రేఖలు' -- వినీల్ కాంత్ మానవరపు (రూ.1 లక్ష)
- ద్వితీయ బహుమతి: 'హైదరాబాద్ హైడ్రా' -- పిల్లి పద్మ యాదవ్ (రూ.50 వేలు)
- తృతీయ బహుమతి: 'మా అమ్మ మహాలక్ష్మి' -- బెన్ రాజ్ బకారం (రూ.30 వేలు)

ఇన్‌ఫ్లుయెన్సర్ వీడియోల విభాగం
- ప్రథమ బహుమతి: 'పెత్తరమాస' -- ప్రసాద్ హైడ్రాబోయిని (రూ.1 లక్ష)
- ద్వితీయ బహుమతి: 'ప్రజా పాలన ప్రభుత్వ పథకాలు' -- హర్షిని మేకల (రూ.50 వేలు)
- తృతీయ బహుమతి: 'హిస్టరీ ఉ కల్చర్ ఆఫ్ తెలంగాణ' -- పిట్టల శ్రవణ్ (రూ.30 వేలు)

## మహాలక్ష్మి, పండుగ బస్సుల
# నిర్వహణలో లోటుపాట్లు లేవు

-హరీశ్ రావు ఆరోపణలపై టీజీఎస్ ఆర్టీసీ స్పష్టత



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 18 :** మహాలక్ష్మి పథకం, పండుగ బస్సుల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేవని టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం స్పష్టం చేసింది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సామాజిక మాధ్యమ వేదికగా సంస్థ నిర్వహణపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని పేర్కొంది. పండుగ సమయాల్లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా టికెట్ ధరల నియంత్రణ, ఇతర నిర్ణయాలు 2003 నాటి జీవో ఆధారంగా నిబంధనల ప్రకారమే తీసుకుంటున్నట్లు తెలిపింది. ప్రయాణికు లపై అదనపు భారం మోపకుండా నిబంధనలకు లోబడే నిర్ణయాలు అమలు చేస్తున్నట్లు వివరిం చింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోందని, మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది. దసరా సందర్భంగా బస్సు సర్వీసులను తగ్గించలేదని, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 7 వేల అదనపు బస్సులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. ఈ నెల 10వ తేదీ నుంచి ఇప్పటివరకు కేటాయించిన అదనపు బస్సుల్లో 97 శాతం సర్వీసులను విజయవంతంగా నడిపించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చినట్లు తెలిపింది. ఉన్నతాధికారులు నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నారని పేర్కొంది. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన రవాణా సేవలు అందించడమే లక్ష్యంగా సంస్థ పనిచేస్తోందని టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం స్పష్టం చేసింది.

## రైతు కూలీల బిడ్డలు
# డాక్టర్లు కావడం గర్వకారణం

- గురుకుల విద్యతో పేద విద్యార్థులకు వైద్య విద్యావకాశాలు
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు



హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 18 : నారాయణఖేడ్ నియోజకవర్గం పలుగు తండాకు చెందిన నిరుపేద రైతు కూలీల దంపతులు వాడిత్య యాదు నాయక్, పాపీ బాయి కుమార్తెలు వాడిత్య నివేదిత, వాడిత్య అఖిల ఎంబీబీఎస్ సీట్లు సాధించడం ఎంతో సంతోషంగా, గర్వంగా ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఈ సందర్భంగా వారిద్దరూ కుటుంబ సభ్యులతో కలిసి తనను కలవడం ఆనందంగా ఉందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఒకప్పుడు వైద్య విద్య అభ్యసించాలంటే కోట్ల రూపాయల ఫీజులు, విరాళాలు చెల్లించగలిగే సంపన్నులకే సాధ్యమనే భావన ఉండేదని హరీశ్‌రావు అన్నారు. పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదనే సంకల్పంతో కేసీఆర్ తెలంగాణవ్యాప్తంగా వందలాది గురుకులాలను ఏర్పాటు చేసి, కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించారని పేర్కొన్నారు. దీనికి తోడు జిల్లాకో వైద్య కళాశాలను ఏర్పాటు చేసి, రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్యను 2,850 నుంచి 10 వేలకు పైగా పెంచిన నిర్ణయం అద్భుత ఫలితాలను ఇస్తోందన్నారు. గురుకులాల్లో ఉచితంగా చదువుకుని వైద్య విద్యకు ఎంపిక కావడం కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల బిడ్డలు నేడు విద్యా సంస్కరణల ఫలితంగా వైద్యులుగా ఎదిగేందుకు సిద్ధమవడం గర్వకారణమన్నారు. బడుగు, బలహీన వర్గాలు, గిరిజన తండాల పిల్లల జీవితాలను కేసీఆర్ విద్యా, సంక్షేమ విధానాలు ఎలా మారుస్తున్నాయో నివేదిత, అఖిల విజయం చాటిచెబుతోందని తెలిపారు. ఎంబీబీఎస్ సీట్లు సాధించిన నివేదిత, అఖిలతో పాటు వారి తల్లిదండ్రులకు హరీశ్‌రావు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత వైద్యులుగా ఎదిగి పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# స్పీకర్ ఔదార్యం

బాధిత కుటుంబానికి రూ. 2లక్షల ఎల్వోసీ అందజేత



**వికారాబాద్, వెలుతురు, అక్టోబర్ 19 :** వికారాబాద్ జిల్లా వికారాబాద్ మండలం అత్వెల్లి గ్రామ ఉప సర్పంచ్ అమృతమ్మ, సత్తయ్య దంపతుల కుమారుడు కంపల్లి ప్రశాంత్ కుమార్ కు తెలంగాణ శాసనసభ సభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ రూ. 2 లక్షల ఎల్వోసీని మంజూరు చేయించారు. ఈ నెల 10 శనివారం రోజున కొత్తగాడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రశాంత్ కుమార్ తీవ్రంగా గాయపడి, హైదరాబాద్ లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వెంటనే స్పీకర్ ప్రసాద్ కుమార్ చలించిపోయారు. బాధిత కుటుంబ పరిస్థితిని తెలుసుకొని, మానవతా దృక్పథంతో వెంటనే స్పందించి, ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఎల్వోసీ మంజూరు అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రశాంత్ కుమార్ త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. నా నియోజకవర్గంలో ఏ ఒక్కరికి కష్టం వచ్చినా నేను అండగా ఉంటాను. ప్రశాంత్ కుమార్ కు మెరుగైన వైద్యం అందించాలని నిమ్స్ వైద్యులను కోరాను. అతని కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుంది అని ఆకాంక్షించారు.

**ప్రశాంత్ కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు**

తమ కుమారుడు ప్రశాంత్ కు అత్యవసర సమయంలో ఆదుకుని, రూ. 2 లక్షల ఎల్వోసీని మంజూరు చేయించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్వెల్లి గ్రామ ఉప సర్పంచ్ అమృతమ్మ, సత్తయ్య దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతిభకు కులం, ప్రాంతం, పేదరికం అడ్డుకాదు

- డాక్టర్ బండి సాయన్న గౌడ్
- విద్యే విజయానికి పునాది.. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం గోపా బాధ్యత
- ఖమ్మం జిల్లా గోపా ఆధ్వర్యంలో గౌడ విద్యార్థినీ, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం





**ఖమ్మం వెలుతురు అక్టోబర్ 18:** ప్రతిభ ఎవరి సొత్తూ కాదని, కులం, ప్రాంతం, పేదరికం ప్రతిభకు అడ్డుకాదని గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా--1975) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బండి సాయన్న గౌడ్ అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించి, వారు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా మార్గదర్శనం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. గోపా ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గౌడ విద్యార్థినీ, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బండి సాయన్న గౌడ్ విద్య యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశాన్ని అందించారు.

**విద్య ఉద్యోగానికే కాదు..**
**జీవిత వికాసానికి కూడా!**

చదువు అంటే కేవలం అక్షరజ్ఞానం సంపాదించడం లేదా ఉద్యోగం పొందడం మాత్రమే కాదని, మంచి చెడులను గుర్తించే విచక్షణ, సమాజం పట్ల బాధ్యత, పెద్దల పట్ల గౌరవం, మానవత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం వంటి విలువలను పెంపొందించుకోవడమని డాక్టర్ బండి సాయన్న గౌడ్ వివరించారు. విద్య మనిషికి ఆర్థిక స్వావలంబనను అందించడంతో పాటు సమాజంలో గౌరవప్రదమైన స్థానాన్ని కల్పిస్తుందని అన్నారు. "చదువు అనేది కేవలం ఉద్యోగం సంపాదించడానికి మాత్రమే కాదు. సంస్కారం, జ్ఞానం, ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవాన్ని పెంపొందించి, ప్రపంచంలో ఎక్కడైనా ధైర్యంగా జీవించే శక్తిని అందించే గొప్ప ఆయుధం" అని ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు అందించగలిగే నిజమైన ఆస్తి డబ్బు కాదని, నాణ్యమైన విద్య అని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఉన్నతంగా చదివించాలని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ముఖ్యంగా గౌడ సమాజంలోని విద్యార్థులు విద్య, ఉద్యోగం, వ్యాపారం, విజ్ఞానం, సాంకేతిక రంగాల్లో రాణించి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి, వారి విజయాలను సమాజానికి పరిచయం చేస్తూ మరింత ముందుకు సాగేందుకు ప్రోత్సహించడం గోపా వంటి సంస్థల ప్రధాన బాధ్యత అని ఆయన తెలిపారు. నేడు అందించే ప్రతిభా పురస్కారాలు విద్యార్థులకు కేవలం బహుమతులు మాత్రమే కాకుండా, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు స్ఫూర్తినిచ్చే ప్రోత్సాహకాలని పేర్కొన్నారు.

లివిలువలతో కూడిన విద్యే నిజమైన అభివృద్ధి -- మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ గౌడ్

మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని, తల్లిదండ్రుల పట్ల గౌరవం, ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని సూచించారు. తల్లిదండ్రుల త్యాగాలను గుర్తించి, వారిని ఆదరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. తల్లిదండ్రులను గౌరవించని వ్యక్తి జీవితంలో నిజమైన అభివృద్ధిని సాధించడం కష్టమని అన్నారు.

**అవకాశాలను అందిపుచ్చుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి**
**– జీవి శ్రీనివాస్ గౌడ్**

గోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తమ విద్యాభ్యాస సమయంలో విద్యార్థులను ప్రోత్సహించే సంస్థలు, వ్యక్తులు పరిమితంగా ఉన్నప్పటికీ పట్టుదలతో చదివి రాష్ట్ర స్థాయికి ఎదిగామని తెలిపారు. నేటి విద్యార్థులకు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు విద్యాసంస్థలు, గోపా వంటి సంస్థల సహకారం అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవాలని, జాతీయ స్థాయితో పాటు అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు పొందేలా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యావంతమైన సమాజమే దేశానికి బలమైన పునాది అని, విద్యకు ప్రాధాన్యతనిస్తూ ప్రతిభను ప్రోత్సహించి, ఐక్యతతో ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. విద్యావంతమైన, ఆత్మగౌరవం కలిగిన, అభివృద్ధి పథంలో పయనించే గౌడ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపా రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిది శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యల్మకంటి మీరయ్య గౌడ్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డాక్టర్ రంజిత్ గౌడ్, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి బొలగాని శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి గండు యాదగిరి గౌడ్, డాక్టర్ గోపగాని సురేందర్ గౌడ్, కత్తి నెహ్రూ గౌడ్, అమరగాని వెంకన్న గౌడ్, డాక్టర్ శ్రీదేవి గౌడ్, డాక్టర్ శివాజీ గౌడ్, డాక్టర్ నల్లమాస క్రిష్ణ గౌడ్, అడ్వకేట్ తిరుమల రావు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంవీఎస్ఆర్ యాజమాన్యంపై హత్య కేసులు నమోదు చేయాలి

-బాధిత కుటుంబాలకు చెరో రూ.కోటి పరిహారం చెల్లించాలి
-బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ డిమాండ్



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 18 :** రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో దాండి యా వేడుకల సందర్భంగా విద్యా ర్థిని సోనీ మృతి చెందడం, మరో విద్యార్థిని మీనా తీవ్రంగా గాయప డటానికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ ఆరోపించారు. విద్యార్థుల భద్రతను విస్మరించిన బాధ్యులపై హత్య కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.350 వసూలు చేస్తూ వేడుకలు నిర్వహించిన యాజమాన్యం కనీస భద్రతా ఏర్పాట్లు చేయలేదని విమర్శించారు. అగ్నిమాపక భద్రత, తొక్కిసలాట నివారణ చర్యలు, ప్రథమ చికిత్స, అంబులెన్స్ సదుపాయాలు కల్పించకపోవడంపై ప్రశ్నించారు. కార్యక్రమానికి అనుమతులు ఇచ్చిన అధికారులు, పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించాల్సిన పోలీసు, విద్యాశాఖ అధికారుల పాత్రపైనా విచారణ జరపాలని కోరారు. తల్లిదండ్రులు కష్టపడి సంపాదించిన సొమ్ముతో లక్షల రూపాయల ఫీజులు చెల్లించేది పిల్లల భవిష్యత్తు కోసమేనని, ఇలాంటి దుర్ఘటనలు ఎదుర్కోవడానికి కాదని పేర్కొన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల నిర్లక్ష్యంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోనీ కుటుంబానికి, గాయపడిన మీనా కుటుంబానికి చెరో రూ. కోటి పరిహారం చెల్లించాలని, బాధిత కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. మీనా పూర్తిగా కోలుకునే వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలన్నారు. కళాశాల యాజమాన్యం, వేడుకల నిర్వాహకుల బాధ్యతను నిర్ధారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భద్రతా ఉల్లంఘనలు రుజువైతే కళాశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఘటనపై హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని దాసోజు శ్రవణ్ కుమార్ కోరారు.

# కూకట్‌పల్లిలో అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ సంబరాలు



భారీ బతుకమ్మతో వడ్డేపల్లి తన్వి...

**కూకట్ పల్లి అక్టోబర్ 18 వెలుతురు:** బతుకమ్మ.. బతుకమ్మ.. ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ కూకట్ పల్లి ప్రాంతం మార్మోగింది. ఆదివారం తెలంగాణ సాంప్రదాయమైన బతుకమ్మ పండుగను (చివరి రోజు సద్దుల బతుకమ్మ) మహిళలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు తీరొక్క పూలతో అందంగా భారీ బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒక్కేసి.. పువ్వేసి.. చందమామ.. ఒక్క జాములాయే చందమామ.. రామ రామ ఉయ్యాలో... రామనే శ్రీరామ ఉయ్యాలో... అంటూ మహిళల పాటలతో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. అలాగే గొట్టిముక్కల సావిత్రమ్మ పాడిన బతుకమ్మ పాటలు అందరిని అలరించాయి. రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన భారీ బతుకమ్మలతో వేలాదిగా తరలివచ్చిన మహిళలు బతుకమ్మలు ఆడారు. చిన్నారులు, మహిళల కోలాటాలు నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కూకట్పల్లిలోని హనుమాన్ చౌరస్తా వద్ద బతుకమ్మలను భారీ ఎత్తున చేర్చి మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ చప్పట్లతో ఆకట్టుకున్నారు. అనంతరం యువతులు దాండియా ఆటలతో చిందులు వేస్తూ బతుకమ్మ ప్రాంగణాన్ని హోరెత్తించారు. ఈ సంబరాల్లో నియోజకవర్గంలో నుంచి వివిధ ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. దీంతో కూకట్ పల్లిలో పండుగ వాతావరణం నెలకొంది. బతుకమ్మల ముందు మహిళలు దాండియా నాట్యాలతో ఆడుతూ పాడుతూ అలరించారు. అనంతరం బతుకమ్మలతో ఊరేగింపుగా వెళ్లి చెరువులు నదుల తో పాటు బతుకమ్మ ఘాట్లలో నిమజ్జనం చేసి వెళ్లిరా గౌరమ్మ అంటూ సాగనంపారు. ఆ తర్వాత మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.



బతుకమ్మతో ఆకుల సరిత, నామాల స్వాతి



భారీ బతుకమ్మతో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు యామిని కుటుంబ సభ్యులు



బతుకమ్మతో కూకట్ పల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు కుటుంబ సభ్యులు




కూకట్ పల్లి హనుమాన్ చౌక్ లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు...



కూకట్ పల్లిలో విదేశీ పూలతో తయారుచేసిన గుండాల నాగరాజు భారీ బతకమ్మ



భారీ బతుకమ్మతో ప్రముఖ పారిశ్రామికవేత్త కురుమయ్య గారి కొండలరావు తిలోత్తమా దంపతులు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ ధరణి దంపతులు కుటుంబ సభ్యులు అశ్రిత్ రావు, అక్షిత్ రావు, అక్షర రావు,



రామగిరి నందిని ఆధ్వర్యంలో తులసి వనంలో బతుకమ్మ వేడుకలు








కూకట్ పల్లిలో భారీ బతుకమ్మలు...

## తెలంగాణ సాంస్కృతికిగా ప్రతీక సద్దుల బతుకమ్మ

**ప్రముఖ సంఘ సేవకులు బజారు బిక్షపతి**

**ఇబ్రహీంపట్నం వెలుతురు అక్టోబర్ 18:** ఇబ్రహీంపట్నం మండలంతెలంగాణ సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్ర కృతిని ఆరాధిస్తూ మానవాళిని ప్రకృతికి దగ్గర చేసే గొప్ప వేడుకని ప్రముఖ సంఘ సేవకులు బజారు బిక్షపతి అ న్నారు ఆదివారం రోజున ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మను అందంగా పేర్చి పూజించడం ఈ పండుగ ప్రత్యేకత అని అన్నారు. మహిళలకు ఎంతో ప్రత్యేకమైన బతుకమ్మ పండుగ తెలం గాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలుస్తుందన్నారు. రాష్ట్రానికి పరిమితంకాకుం డా



దేశ విదేశాల్లోనూ గుర్తింపు పొందిన ఈ పండుగ తెలంగాణ ప్రజలు సంస్కృతిక వైభవాన్ని చాటి చెబుతుందని పేర్కొన్నారు. ప్రకృతిని గౌరవిస్తూ సంస్కృతి సంప్రదాయాలను భావితరాల కు అందించేలా ప్రతి ఒక్కరు పండుగలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని సూచించా రు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు చిన్న పెద్ద అందరు పాల్గొన్నారు

## ఘనంగా జనంపల్లి అరుష్ రెడ్డి జన్మదిన వేడుకలు

**కూకట్ పల్లి అక్టోబర్ 18 వెలుతురు:** రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి ముద్దుల మనుమడు, ఎన్నారై జనంపల్లి అరుష్ రెడ్డి జన్మదిన వేడుకలను కూకట్ పల్లిలో పత్రికా విలేకరుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి, కార్యదర్శి ఆర్. రామచంద్రరావు, కమిటీ సభ్యులు పత్రికా సోదరులను శాలువాలతో సత్కరించి, కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో పత్రికా విలేకరులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. సమాజానికి విశేష సేవలందిస్తున్న పత్రికా సోదరుల సమక్షంలో తన మనవడి జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో అదృష్టంగా, ఆనందంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా పత్రికా సోదరులు అరుష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ.. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, విద్యాబుద్ధులతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఎల్లప్పుడూ చిరునవ్వుతో సంతోషంగా ఉండాలని



ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి, కార్యదర్శి ఆర్. రామచంద్రరావు, కమిటీ సభ్యులు జి. ప్రసాద్, జి. నర్సింగరావు, లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ, శ్రీధర్, టైగర్ పురుషోత్తం, గణేష్ మూర్తి, గ్రానైట్ సూర్యనారాయణ, సునీల్ పటేల్, కిషోర్, నాని తదితరులు పాల్గొని అరుష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలి

**కూకట్‌పల్లిలో పలు దుర్గామాత మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు**

**కూకట్ పల్లి అక్టోబర్ 18 వెలుతురు:** దేవి శరన్నవరాత్రుల సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారి మండపాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు సందర్శించారు. ఉత్సవ కమిటీల ఆహ్వానం మేరకు మండపాలకు చేరుకున్న ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, కూకట్‌పల్లి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా వివిధ మండపాల వద్దకు చేరుకున్న వడ్డేపల్లి రాజేశ్వరరావుకు



ఉత్సవ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాల్లో నెలకొన్న భక్తిపూర్వక వాతావరణాన్ని ఆయన ఆస్వాదించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. దేవి శరన్నవరాత్రులు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. దుర్గామాత ఆరాధన భక్తి, శక్తి, ధర్మం, న్యాయానికి ప్రతిరూపమని అన్నారు. నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు, కులమతాలకు అతీతంగా ప్రజలందరినీ ఒక్కటిగా చేర్చి ఐక్యతా భావాన్ని బలోపేతం చేస్తాయని తెలిపారు. దుర్గామాత కరుణాకటాక్షాలతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సౌభాగ్యాలు వెల్లివిరియాలని, ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం కలగాలని ఆకాంక్షించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు వెల్లడించారు. భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. ఉత్సవాల నిర్వహణలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రశాంతమైన వాతావరణంలో పూజా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

## సంక్షేమ పథకాలతో భవన నిర్మాణ కార్మికులకు భరోసా..

- **జనసేన పార్టీ శ్రామికుల సంక్షేమానికి కట్టుబడి ఉంది: ముమ్మారెడ్డి ప్రేమకుమార్**

**కూకట్ పల్లి అక్టోబర్ 18 వెలుతురు:** భవన నిర్మాణ కార్మికులు, శ్రామికుల సంక్షేమానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జనసేన రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ అన్నారు. కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడంతో పాటు, వారి ఆరోగ్యం, ఆర్థిక భద్రతకు అవసరమైన సహకారం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని ఏవీబీ పురంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో జనసేన నాయకుల ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డులు, ఈ-శ్రమ్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది కార్మికులకు ముమ్మారెడ్డి



ప్రేమకుమార్ చేతుల మీదుగా కార్డులు అందజేశారు. కార్మికుల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని అదే ప్రాంగణంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రేమకుమార్ మాట్లాడుతూ.. జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ భవన నిర్మాణ కార్మికులు, శ్రామికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. కష్టపడి పనిచేసే కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు, భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. లేబర్ కార్డులు, ఈ-శ్రమ్ కార్డుల ద్వారా అర్హులైన కార్మికులకు అందుబాటులో ఉన్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు, వాటి ప్రయోజనాలు పొందేందుకు కృషి చేయాలని జనసేన నాయకులకు సూచించారు. కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, ప్రతి కార్మికుడు తన ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. శ్రామిక వర్గాల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి జనసేన పార్టీ నిరంతరం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు కొల్లా శంకర్‌తో పాటు ఏవీబీ పురం జనసైనికులు ప్రసాద్ రావు, సింహాద్రి, రాజు, పేరంబరావు, లక్ష్మణరావు, శివశంకర్, గోవింద్, దుర్యోధన, ధనుంజయ్, అనంతరావు, కృషి పాల్గొన్నారు.

# సనాతన ధర్మమే ప్రపంచ మానవాళికి శిరోధార్యం

- యువతలో దైవభక్తి, దేశభక్తి ఉండాలి
- ‘విశ్వగురు’గా భారత్.. యువతతోనే సాధ్యం
- ఘనంగా ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవం
- హాజరైన సేవక్స్, ఉప్పల్‌నగర్ కార్యకారిణి, సూర్యానగర్, విజయపురి కాలనీ, లక్ష్మారెడ్డి బస్తీ ప్రముఖులు





**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 18:** సనాతన ధర్మమే ప్రపంచ మానవాళికి శిరోధార్యం.. దైవభక్తి, దేశభక్తితో భారత్‌ను ‘విశ్వగురు’గా నిలపడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఆర్ఎస్ఎస్.. యువతతోనే సాధ్యం అని స్పష్టం చేసింది. దేశం కోసం, ధర్మం కోసం పనిచేస్తున్న యువతలో ఉండే అపారమైన నమ్మకమే దేశాన్ని ప్రపంచ పటంలో అగ్ర స్థానంలో నిలుపుతుందని అభిప్రాయ పడింది. ఈ విజయదశమితో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 102 వసంతాలను పూర్తి చేసుకొంది. ఇందులో బాగంగా విజయదశమి ఉత్సవాన్ని పురస్కరించుకొని ఆర్ఎస్ఎస్ ఉప్పల్ నగర్, ఉప్పల్ భాగ్ ఆధ్వర్యంలో సూర్యానగర్ కమ్యూనిటీ హాల్‌లో అత్యంత ఘనంగా విజయదశమి ఉత్సవము నిర్వహించారు. ఈ ఉత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడికంటి శ్రీనివాస్ ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్, సనాతన ధర్మ ప్రచారకులు, ముఖ్య వక్తగా డాక్టర్ కుమారస్వామి గుళ్లపల్లి హాజరయ్యారు. ఈ సందర్భంగా కోడికంటి శ్రీనివాస్ మాట్లాడుతూ... మహిషాసురుడిపై దుర్గాదేవి సాధించిన విజయానికి ప్రతీకవిజయదశమి అని, దేశం ప్రస్తుత కాలంలోని పరిస్థితులలో విజయదశమితో పాటు హైంధవ పండుగలన్ని చరిత్రతో పాటు హింధుత్వ విశిష్టత, సంస్కృతి సంప్రదాయాలను చాటి చెప్పడంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దైవ భక్తి, దేశ భక్తి ఉన్న యువతలో తల్లిదండ్రులు, అక్క చెల్లెళ్లు, కూతుళ్ల పట్ల అపారమైన ప్రేమ కలిగి ఉంటారని చెప్పారు. వారు అటు దేశాన్ని, ఇటు సంఘం పట్ల నిత్యం సేవకులుగా ఉంటారన్నారు. నేడు జరుపుకొంటున్న విజయదశమి ఉత్సవమునకు ఎంతో విశిష్టత ఉందన్నారు. సెక్యూలర్ పేరుతో ‘విశ్వగురు’గా ఎదుగుతున్న భారత్ పట్ల నేడు కొందరు విషం చిమ్ముతున్న తీరును వారు ఎండగట్టారు. దేశం.. ప్రస్తుత కాలంలోని పరిస్థితులలో యువత, పౌరులు ఆర్ఎస్ఎస్‌తో కలిసి దేశ నిర్మాణంలో పాలుపంచుకోవాలని, దేశాన్ని, ధర్మాన్ని ఆర్ఎస్ఎస్ మాత్రమే కాపాడగలదని విశ్వసించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా డాక్టర్ కుమారస్వామి గుళ్లపల్లి మాట్లాడుతూ... విజయదశమి అనగానే మనకు అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే అద్భుతమైన పండుగ గుర్తుకు వస్తుంది. విజయదశమి ప్రస్తావనలో దాగివున్న పౌరాణిక నేపథ్యంతో పాటు, సనాతన ధర్మం, లలితా సహస్రనామాలలో దాగివున్న శాస్త్ర విజ్ఞానం, భారతీయ జ్ఞాన పరంపర విజ్ఞానాన్ని నేడు యువతకు ఎలా అన్వయించాలో ఆయన తెలిపారు. ఇది కేవలం ఒక ఆచారం కాదు మానవాళికి నిత్యం ఆచరణీయమైన ఒక గొప్ప జీవన తత్వశాస్త్రం అందులో దాగివున్న పౌరాణిక నేపథ్యంతో పాటు, సనాతన ధర్మం, లలితా సహస్రనామాన్ని పఠించడం వల్ల నాడీ వ్యవస్థలో మార్పులు (న్యూరోలాజికల్ సిస్టం), మెదడు తరంగాలలో మార్పు (బ్రెయిన్ వేవ్ ఆల్టరేషన్) చోటుచేసుకుంటాయి. దీనివల్ల ఒత్తిడిని కలిగించే బీటా తరంగాలు (బీటా వేవ్స్) తగ్గి, కార్టెక్స్ అనే హార్మోన్ విడుదలయ్యి మనస్సు ప్రశాంతంగా, స్థిరంగా ఉంటుందని మరియు భారతీయ జ్ఞాన పరంపర అయినా వేద విజ్ఞానం కేవలం ఆధ్యాత్మిక విజ్ఞానమే కాకుండా వేదంలో సైన్స్, ప్రకృతి, సంగీతం, శాస్త్ర విద్య మొదలగు విషయాలు దాగివున్న విషయాన్ని నేడు యువతకు ఎలా అన్వయించాలో తెలిపారు. అలాగే దేశ నిర్మాణంలో ఆర్ఎస్ఎస్ పాత్ర, భారతీయ తత్వము, ప్రపంచ మానవాళికి సనాతన ధర్మమే శిరోధార్యమని,దేశ యువత దైవభక్తితో పాటు దేశభక్తిని కలిగి ఉండటం అనివార్యమని, అప్పుడే (భారత్)దేశం ‘విశ్వగురు’ స్థానాన్ని అధిగమిస్తుందని ఉద్ఘాటించారు. అలాగే ఆర్ఎస్ఎస్ వంద సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా సంఘం తీసుకున్న పంచ పరివర్తన అంశాలు పర్యావరణం, కుటుంబ వ్యవస్థ, స్వదేశీ, సామాజిక సామరస్యం, పౌర నియమాలు నేడు ప్రజాజీవితానికి అత్యంత అవసరమని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్–ఉప్పల్ నగర్ కార్యకారిణి, లక్ష్మారెడ్డి బస్తీ ప్రముఖులు, సూర్యానగర్, విజయపురి కాలనీ వాసులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**ఆర్ఎస్ఎస్ అవిర్భావం, విశిష్టత..**

భారతదేశాన్ని తమ మాతృభూమిగా భావించే ప్రజల ప్రయోజనాలను పరిరక్షించటం తమ ఆశయంగా ఈ సంస్థ ఉద్ఘాటించింది. ఆర్ఎస్ఎస్ ఒకవైపు హిందూ జాతీయవాద భావ–నతో దేశ సమగ్రతకు కృషి చేస్తూనే.. మరోవైపు భారతదేశ సామాజిక, రాజకీయ, సాంస్కృతిక దిశను శాసించగల అత్యంత శక్తివంతమైన సంస్థగా నిలుస్తోందన్నారు. భారతీయ హిందూ సమాజాన్ని భారతీయ సంస్కృతిని, పౌర సమాజం యొక్క విలువలను సమర్థించే ఆదర్శాలను ప్రోత్సహిస్తు.. హిందూ సమాజాన్ని ‘బలోపేతం చేయడానికి‘ హిందుత్వ భావజాలాన్ని వ్యాప్తి చేస్తుందని గుర్తు చేశారు. ఇక, దేశంలో ఎక్కడ భూకంపాలు, వరదలు లేదా ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా ‘సేవా భారతి’ ద్వారా ఆర్.ఎస్.ఎస్ స్వయంసేవకులు ముందుండి సహాయక చర్యలు చేపడతారన్నారు. మొదట ఒక ప్రముఖ హిందూ జాతీయవాద సంస్థగా ఎదిగిన ఆర్ఎస్ఎస్.. నేడు అనేక అనుబంధ సంస్థలకు దారితీసింది. దాని సైద్ధాంతిక విశ్వాసాలను వ్యాప్తి చేయడానికి అనేక పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థలు, క్లబ్లను స్థాపించింది. అలా హిందూ జాతీయవాద ఉద్యమంలో ఆర్ఎస్ఎస్ చారిత్రాత్మకంగా ప్రధాన పాత్ర పోషించింది. నేటితో ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి 102 ఏళ్లు పూర్తి చేసుకుని 2026 విజయదశమి వేడుకలను బస్తీలు, నగరాలు, తాలుకాలు, పట్టణాలలో సైతం ఘనంగా నిర్వహించింది. ఇక, ఆర్ఎస్ఎస్, దీని అనుభంధ సంస్థలన్నింటినీ కలిపి సంఘ్ పరివార్ అని పిలుస్తారు. భారతీయ మజ్దూర్ సంఘ్, భారతీయ కిసాన్ సంఘ్, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, వనవాసి కళ్యాణ ఆశ్రమం, స్వదేశీ జాగరణ మంచ్, ప్రజ్ఞా ప్రవాహ్, ఇతిహాస సంకలన సమితి, విద్యా భారతి, సంస్కార భారతి, సంస్కృత భారతి, అధివక్తా పరిషత్, పూర్వ సైనిక పరిషత్, భారతీయ జనతా పార్టీ, విశ్వ హిందూ పరిషత్, రాష్ట్ర సేవికా సమితి వీటిలో ముఖ్యమైనవి. ఆర్ఎస్ఎస్ తోపాటు ఈ సంస్థలన్నింటికి చాలా పెద్ద సంఖ్యలో సభ్యులున్నారు.

## చిద్విలాసిని భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నా.

**బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**



**మిర్యాలగూడ వెలుతురు అక్టోబర్ 18:** చదరంగం క్రీడలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పాఠశాల క్రీడలకు ఎంపికైన కుమ్మరి కుంట్ల చిద్విలాసినిని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అభినందించారు. చిన్న వయసులోనే చదరంగం క్రీడలో ప్రతిభను చాటుకొని జాతీయ స్థాయికి ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. చిద్విలాసిని తన ప్రతిభ,పట్టుదల,కృషితో జాతీయ స్థాయిలోనూ అద్భుత విజయాలు సాధించి తెలంగాణ రాష్ట్రానికి,తన తల్లి దండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, క్రీడారంగంలో మరింత రాణించి ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని జాజుల లింగంగౌడ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి దుర్గయ్య ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇస్లావత్ సైదా నాయక్ గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు లావూరి రవీందర్ నాయక్ నక్క నాగరాజు కుమ్మరి కుంట్ల సుధాకర్ ఆలంపల్లి సైదులు చరణ్ తేజ కార్తీక్ శశాంక్ రాంబాబు యాదవ్ మధు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ



**ఆడపడుచులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న బీజేపీ మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పనా యాదవ్**

**చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 18:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలు చౌటుప్పల్ మున్సిపాలిటీ వ్యాప్తంగా అత్యంత వైభవంగా జరిగాయి. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పనా యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి ప్రసాదించిన రంగురంగుల పువ్వులతో తీర్చిదిద్దిన బతుకమ్మల చుట్టూ స్థానిక ఆడపడుచులతో కలిసి ఆమె ఆటపాటలతో సందడి చేశారు. చౌటుప్పల్ మున్సిపల్ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ, పాటలు పాడుతూ వారిలో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు. అనంతరం కడారి కల్పనా యాదవ్ మాట్లాడుతూ--- ప్రకృతిని దైవంగా భావించి పూజించే ఏకైక పండుగ బతుకమ్మ అని, తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ఇది ప్రతీక అని పేర్కొన్నారు. మున్సిపల్ ప్రజలందరికీ ఈ సందర్భంగా సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో మున్సిపల్ మహిళలు, ఆడపడుచులు పాల్గొన్నారు.

## అంబరాన్నంటిన తెలంగాణ సంస్కృతి సద్దుల బతుకమ్మ



**నూతనకల్ అక్టోబర్ 18( వెలుతురు )** తెలంగాణ రాష్ట్రసంస్కృతి సాంప్రదాయాలకు నిలయంగా రాష్ట్రపండుగగా గుర్తింపు పొందిన బతుకమ్మ పండుగ ఆశ్వయుజ మాసంలో జరుపుకుంటారు. బతుకమ్మ తయారీకి ముఖ్యంగా తంగేడు గునుగు బంతి చామంతి పూలతో పేర్చి పసుపుతో గౌరమ్మని చేసి గౌరీదేవిని పూజిస్తారు తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బతుకమ్మ పాటలతో బతుకమ్మల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ కోలాటం మాడుతూ పాటలు పాడుతూ మహిళలు యువతులు ఉత్సాహంతో సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం మండల వ్యాప్తంగా మహిళలు సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించారు, చివరి రోజు సద్దుల బతుకమ్మ కావడంతో పల్లె పట్టణాలు తేడా లేకుండా తెలంగాణ రాష్ట్రంలో పువ్వులతో చేసే అతిపెద్ద పండుగ సద్దుల బతుకమ్మ పండుగ తీరక పూలతో పేర్చిన బతుకమ్మను చెరువులు కుంటలు వాగులలో నిమజ్జనం చేయడం వలన ఆ నీటి శుద్ధి అవుతుందని తత్ఫలితంగా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పెద్దలు మహిళలు చెబుతున్నారు. ఈ కార్యక్రమాలలో వివిధ గ్రామాల సర్పంచులు, మహిళలు, పౌరులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## “బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్-2026” లో బేతి నాగరాణికి జ్యూరీ పురస్కారం




**మోత్కూర్, అక్టోబర్ 18,వెలుతురు న్యూస్ :** తెలంగాణ ప్రభుత్వ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అత్యంత వైభవంగా నిర్వహించిన “బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ – 2026” పోటీల్లో వ్యాసాల (ఆర్టికల్స్) విభాగంలో మోత్కూర్ కి చెందిన రచయిత్రి, తెలుగు వికీపీడియన్ బేతి నాగరాణి ప్రతిష్టాత్మక ప్రత్యేక జ్యూరీ బహుమతిని కైవసం చేసుకున్నారు. ఆమె రాసిన “ప్రగతిపథంలో ప్రజాపాలన” అనే వ్యాసానికి ఈ గౌరవం దక్కింది. అక్టోబర్ 18న హైదరాబాద్, మాదాపూర్ లోని శిల్పకళా వేదికలో తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజు, ఎఫ్‌డీసీ ఈడి కిషోర్ బాబు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా. మామిడి హరికృష్ణ, సినీ నటుడు రచ్చ రవి తదితరులు బేతి నాగరాణికి పురస్కారాన్ని అందజేసి, అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగిన ఈ పోటీకి వెయ్యికి పైగా వ్యాసాలు రాగా అందులో ప్రజాపాలనా దృక్పథాన్ని, సామాజిక–ఆర్థిక మార్పులను స్పష్టమైన విశ్లేషణ, ఆకట్టుకునే శైలిలో వివరించినందుకు గాను బేతి నాగరాణికి ఈ ప్రత్యేక జ్యూరీ పురస్కారం లభించింది. ప్రజాపాలనలోని వివిధ కోణాలను వ్యాసంలో అత్యద్భుతంగా ఆవిష్కరించినందుకు ఎఫ్‌డీసీ అధికారులు, పలువురు ప్రముఖులు నాగరాణిని ప్రత్యేకంగా ప్రశంసించారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ ఉత్సవాలు

- ఆటపాటలతో మార్మోగిన పల్లెలు
- పూల సంబరాలతో పులకించిన ఆడపడుచులు



**గుండాల, అక్టోబర్ 18 (వెలుతురు):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను గుండాల మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళలు, ఆడపడుచులు అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. పూలను పూజించే అపురూపమైన సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ గ్రామగ్రామాన పండుగ శోభను సంతరించుకుంది. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో పల్లెలన్నీ పూలవనాలుగా మారగా, ఆడపడుచుల ఆటపాటలతో పండుగ ప్రాంగణాలు సందడిగా మారాయి. తెలంగాణ ఆడపడుచులు తమ కుటుంబాల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని కోరుకుంటూ బతుకమ్మను భక్తితో కొలవడం ఆనవాయితీగా వస్తోంది. తరతరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతిపై వారికున్న ఆరాధనాభావానికి ప్రతీకగా నిలుస్తోంది. పూలతో బతుకమ్మను పేర్చి, గౌరమ్మను ఆరాధిస్తూ, సంప్రదాయ పాటలతో సంబరాలు జరుపుకోవడం ఈ పండుగ ప్రత్యేకత. మండలంలోని పలు గ్రామాల్లో బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాల వెలుగులతో ఉత్సవ ప్రాంగణాలు కళకళలాడగా, సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు, ఆడపడుచులు అందంగా అలంకరించిన బతుకమ్మలను చేతబట్టి ఉత్సవ ప్రాంగణాలకు చేరుకున్నారు. వేద పండితులు గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం మహిళలందరూ బతుకమ్మల చుట్టూ చేరి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తూ, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆటపాటల్లో పాల్గొన్నారు. ఒకరి గొంతుతో మరొకరి గొంతు కలుపుతూ ఆలపించిన జానపద గీతాలు గ్రామీణ వాతావరణాన్ని ఆధ్యాత్మికతతో, ఆనందోత్సాహాలతో నింపాయి. మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలు, పూల పరిమళాలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బతుకమ్మ పండుగ కేవలం పూల పండుగ మాత్రమే కాకుండా మహిళల ఐక్యతకు, కుటుంబ బంధాలకు, తెలంగాణ గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే గొప్ప సంప్రదాయ వేడుక. ఈ పండుగ సందర్భంగా ఆడపడుచులంతా ఒకచోట చేరి తమ సంప్రదాయాలను గుర్తుచేసుకుంటూ, పెద్దలు అందించిన ఆచారాలను భవిష్యత్ తరాలకు అందించాలనే సంకల్పంతో సంబరాలు జరుపుకున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొనడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పాటలు పాడి, పూజలు ముగించిన అనంతరం మహిళలు తమ బతుకమ్మలను తీసుకొని గ్రామ సమీపంలోని చెరువుల వద్దకు చేరుకున్నారు. అక్కడ గంగమ్మ ఒడిలో బతుకమ్మలను నిమజ్జనం చేసి, గౌరమ్మకు భక్తిపూర్వకంగా వీడ్కోలు పలికారు. బతుకమ్మను సాగనంపే సమయంలో మహిళలు భావోద్వేగానికి లోనవుతూనే, వచ్చే ఏడాది మళ్లీ తమ ఇళ్లలోకి సంతోషంగా రావాలని గౌరమ్మను ప్రార్థించారు. సద్దుల బతుకమ్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవడం పట్ల మహిళలు, ఆడపడుచులు ఆనందం వ్యక్తం చేశారు. తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పలువురు అభిప్రాయపడ్డారు. గుండాల మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్లు . వార్డు సభ్యులు.గ్రామ మహిళలు, యువతులు, చిన్నారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆడపడుచుల ఆటపాటలు, సంప్రదాయ గీతాలు, పూల అందాలతో మండలంలోని పల్లెలన్నీ పండుగ శోభను సంతరించుకున్నాయి.





## బీజేవైఎం బలోపేతానికి కృషి చేస్తా

**మునుగోడు,అక్టోబర్ 18 (వెలుతురు )** :బీజేవైఎం బలోపేతానికి కృషి చేస్తానని జిల్లా సహాయ కోశాధికారిగా ఎన్నికైన మెగుదాల లింగస్వామి తెలిపారు. మండలంలోని కొంపల్లి గ్రామానికి చెందిన ఆయన తన ఎన్నికకు సహకరించిన బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి సతీష్‌కుమార్ యాదవ్, లేబర్ సెల్ జిల్లా కో–కన్వీనర్ మాదగోని నరేందర్‌గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు కంభంపాటి నర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పార్టీ అధిష్ఠానం చేపట్టే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని వాటి విజయానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## ఎండిన పొలాల్లో బతుకమ్మ

**మునుగోడుకు సాగు, తాగునీరు అందించాలి**



**మునుగోడు, అక్టోబర్ 18 (వెలుతురు ):** ఎండిన వరి పొలాల్లో బతుకమ్మలు ఆడుతూ రైతులు వినూత్నంగా నిరసన తెలిపారు. డిండి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసి మునుగోడు ప్రాంతానికి సాగు, తాగునీరు అందించాలని డిండి ఎత్తిపోతల పథకం సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం సింగారం గ్రామంలో ఈ కార్యక్రమం చేపట్టారు. బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు కాలువ పరిధిలోని పొలాల్లో సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణరాంపల్లి, శివన్నగూడెం ప్రాజెక్టులకు డిండి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని అందించాలని డిమాండ్ చేశారు. సాగునీటి కొరతతో రైతులు నష్టపోతుండగా, తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి మునుగోడు నియోజకవర్గ ప్రజల నీటి కష్టాలు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి నాయకులు, రైతులు పొలగొని సైదులు గౌడ్,మేకల శ్రీనివాస్ రెడ్డి, మారగోని అంజయ్య గౌడ్,గురిజా సునీల్,గుర్రాల సురేష్, నవీన్,సాయి, నాగరాజు,మధు, మల్లయ్య,పరమేశ్, లింగమ్మ,అంజమ్మ, రాధ,భద్రమ్మ, అండాలు,లక్ష్మమ్మ, పావని,సుజాత పాల్గొన్నారు.

## కొత్త ఆసరా పెన్షన్ల అమలు వట్టిమాటనా

**వెంటనే ఆసరా కొత్త పెన్షన్లు మంజూరు చెయ్యాలి- సిపిఎం**




**మోత్కూర్, అక్టోబర్ 18,వెలుతురు న్యూస్ :** నాలుగేళ్లుగా ఆసరా పెన్షన్లు మంజూరు లేక, అర్హులైన ఎంతో మంది లబ్ధిదారులు ఎదిరిచుస్తున్నారని వారికి ప్రభుత్వం వెంటనే కొత్త పెన్షన్లు మంజూరు చెయ్యాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రోజున మోత్కూర్ పార్టీ నాయకులతో కలసి పత్రికా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ అర్హులదరికి దసరా నుండి ఆసరా కొత్త పెన్షన్లు ఇస్తామంటూ ప్రభుత్వం ఆగస్టు 15 నుండి సెప్టెంబర్ 15 వరకు నెలరోజుల పాటు అర్హులైన లబ్ధిదారుల నుండి ధరకాస్తులు స్వీకరించి దసరా నుండి లబ్ధిదారులకు అందిస్తామని ప్రభుత్వం ప్రకటన చేసిందని, కానీ ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. వృద్యాప్య పెన్షన్కు ధరకాస్తులో ఆప్షన్ లేకపోవడంతో అర్హులైన వృద్ధులు అనేకమంది ఆందోళన చెందుతున్నారని, ఈ నాలుగేండ్ల కాలంలో 57 సంవత్సరాలు నిండిన వారికి అవకాశం లేకపోవడంతో నిరాశకు గురియ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు పెన్షన్ ఎప్పటికి మంజూరు చేస్తారనేది కూడ ప్రభుత్వం నుండి స్పష్టత లేదని, గత 2022 లో ఆఖరి సారి చేయూత పెంక్షన్ మంజూరు చేయగా ఇప్పటికి నాలుగేండ్లు గడచిన కొత్తవి మంజూరు చేయలేదని అన్నారు. ఈ ఏడాది దసరాకు కొత్త పెన్షన్లు ఇస్తామంటూ ప్రభుత్వం ప్రకటించగా అర్హులైన వితంతు, వంటరి మహిళలు, దివ్యంగులు, పైలేరియా, బోధకాలు, చేనేత, గీతకార్మికులు ధరకాస్థులు చేసుకున్నప్పటికి ప్రభుత్వం ఎప్పుడు మంజూరు చేస్తుందోనని ఎదిరిచుస్తున్నారని, ఇప్పటికైన ధరకాస్తు చేసుకున్న లబ్ధిదారులకు వెంటనే మంజూరు చేస్తూ, వృద్ధులకు కూడ పెంక్షన్ పొందెందుకు అవకాశం కల్పిస్తూ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, పానుగుల రమేష్, ఉన్నారు.

## ఝరాసంగం దేవస్థానం డైరెక్టర్‌గా ఏ. వీర్ శెట్టి నియామకం

**నూతన డైరెక్టర్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్**



**వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 18 :** సంగారెడ్డి జిల్లా ఝరాసంగంలోని ప్రసిద్ధ శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి దేవస్థానం డైరెక్టర్‌గా ఏ. వీర్ శెట్టి నియమితులయ్యారు. ఈ సందర్భంగా జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్ ఆదివారం వీర్ శెట్టిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. దేవస్థానం అభివృద్ధికి కృషి చేయడంతో పాటు, స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా పనిచేయాలని ఎంపీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నూతన డైరెక్టర్ ఏ. వీర్ శెట్టి మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేష్ షెట్కర్, డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చంద్రశేఖర్, మాజీ జెడ్పీ చైర్మన్ సునీత హనుమంతరావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దేవస్థానం డైరెక్టర్‌గా ఏ. వీర్ శెట్టి నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

## శాకంబరీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

- ఎక్కేల్లి హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో చండీ హోమం
- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 18:** దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జహీరాబాద్ పట్టణంలోని రాజన్నపేట--సుభాష్ గంజ్‌లో ఎక్కేల్లి హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి మండపం వద్ద చండీ హోమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలు, పూజా కార్యక్రమాల మధ్య హోమం నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శాకంబరీ దేవిని ప్రకృతి, పంటలు, ఆహార సమృద్ధికి ప్రతీకగా భక్తులు ఆరాధిస్తారు. ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని, రైతులు పాడిపంటలతో వర్ధిల్లాలని, జహీరాబాద్ పట్టణం అష్టైశ్వర్యాలతో అభివృద్ధి చెందాలని భక్తులు అమ్మవారిని ప్రార్థించారు.

## పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ భరోసా

- అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సహాయ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 18:** అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు అన్నారు. మొగుడంపల్లి మండల పరిధిలోని తొమ్మిది మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను ఆయన మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సంజీవ్ రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థికంగా ఎంతో తోడ్పాటునందిస్తోందని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న సహాయ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

**లబ్ధిదారుల వివరాలు:**
మొగుడంపల్లి మండల కేంద్రం: రియాజ్ ఉద్దీన్ రూ. 9,000, నేతాజీ సుజాత రూ. 24,000, కమ్మలు సుమతి రూ. 13,500, విశ్వనాథ్ రూ. 87,000, కరుణ రూ. 33,000., విట్టు నాయక్ తండా: చౌవాన్ అనిత రూ. 25,000, రామావత్ రామచంద్ర రూ. 7,000, జాడి మల్కాపూర్: ఎర్ర గొల్ల శ్రీవాణి రూ. 15,000. మిర్జంపల్లి తండా: లక్ష్మీబాయి రూ. 22,500. ఈ కార్యక్రమంలో సంజు పవార్, రాములు, వెంకట్, కృపాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో జర్నలిస్టులకు ఇంటి నిర్మాణ బిల్లులు

- అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలాలు కేటాయిస్తాం
- టీడబ్ల్యూజేఎఫ్ నూతన కార్యవర్గ సన్మాన
- కార్యక్రమంలో ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్
- మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్



**వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 18:** సంగారెడ్డి జిల్లా:- నారాయణఖేడ్ పట్టణంలో ఇంటి స్థలాలు మంజూరై, ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న జర్నలిస్టులకు త్వరలోనే నిర్మాణ బిల్లులు అందజేస్తామని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలాలు కేటాయించేందుకు కృషి చేస్తామని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్ అన్నారు. ఆదివారం ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ స్వగృహంలో నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్‌తో కలిసి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నారాయణఖేడ్‌తో పాటు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రస్తుత ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించినట్లు గుర్తుచేశారు. ఇంటి నిర్మాణాలు చేపట్టిన జర్నలిస్టులకు సంబంధించి బిల్లుల ప్రక్రియ ప్రారంభమైందని, త్వరలోనే అర్హులకు బిల్లులు అందజేస్తామని వెల్లడించారు. అలాగే అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం కేటాయించేందుకు, ఇల్లు నిర్మించుకునేలా అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, వారి కుటుంబాల భద్రతకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునిగాల మానిక్ ప్రభు, నారాయణఖేడ్ డివిజన్ అధ్యక్షుడు పుట్టి సంజీవ్ కుమార్, ప్రధాన కార్యదర్శి యం.ఏ ఖైసర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రతాప్, కోశాధికారి ఇబ్రహీం, ఉపాధ్యక్షులు అంజనేయులు, శరణప్ప, ఫైయజ్, డైనియల్, సిద్ధరాం, పుండ్లిక్ నాగ్ శెట్టి, మోహన్ రాథోడ్, సలహాదారుడు అరుణ్, బాధ్యులు హాబీబ్ ఉల్లా, శయబాజ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్నాథ్‌పూర్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- సంప్రదాయ దుస్తుల్లో యువతుల సందడి
- ఆటపాటలతో పండుగ సంబరాలు





**వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 18:** సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ మండల పరిధిలోని జగన్నాథ్‌పూర్ గ్రామంలో బతుకమ్మ వేడుకలను మహిళలు, యువతులు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల బతుకమ్మలను అందంగా అలంకరించి పండుగ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ, నృత్యాలతో సందడి చేశారు. ఆటపాటలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ముఖ్యంగా యువతులు సంప్రదాయ వస్త్రధారణలో ఉత్సాహంగా పాల్గొని, ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ వేడుకలను జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను అందరూ కలిసి ఆనందంగా నిర్వహించుకున్నారు.



## రైతాంగానికి అండగా నిలుద్దాం..

- 23న కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయండి

**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 18:** రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతాంగం పట్ల తీవ్ర నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వ మొద్దు నిద్రను మట్టుబెట్టేందుకే ఈనెల 23న కలెక్టరేట్ ఎదుట భారీ ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు బిజెపి సీనియర్ నాయకులు పేరుక శ్రావణ్ స్పష్టం చేశారు. బిజెపి కొత్తపల్లి జోన్ అధ్యకులు ముత్తునూరి హరీష్ రావు ఆధ్వర్యంలో బిజెపి ముఖ్య నాయకుల,కార్యకర్తల సమావేశం కు పేరుక శ్రావణ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చేతికి వచ్చిన పంట సాగునీరు లేక కళ్ల ముందే ఎండిపోతుంటే ప్రభుత్వం చూస్తుదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం బావుల కింద ఉన్న నీళ్లతోనైనా పంటలను కాపాడుకుందామని రైతులు తాపత్రయపడుతుంటే, అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను తీవ్ర గోస పెడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతాంగానికి చిన్నచూపే దక్కిందని దుయ్యబట్టారు. పంటలను, రైతులను ఆదుకోవాల్సిన బాధ్యతను విస్మరించి రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, నిద్రమత్తులో ఉన్న ఈ ప్రభుత్వానికి కన్నువిప్పు కలిగించేందుకే బిజెపి ఆధ్వర్యంలో 23న ధర్నా కార్యక్రమాన్ని తలపెట్టామని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహించే ఈ పోరాటంలో రైతాంగం, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వాసాల రమేష్, జిల్లా నాయకులు గుంజేటి శివకుమార్, సత్యనారాయణ రెడ్డి, రాచకొండ కొమురయ్య, శ్రీనివాస్ నాయక్, సుధాగోని గణేష్,ఆకుల శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు

## హౌసింగ్ బోర్డు కాలనీలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

- యువసేన మట్టి గణేష్ ఆధ్వర్యంలో వేడుకలు...
- సంప్రదాయబద్ధంగా పాల్గొన్న మహిళలు...





**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 18:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో యువసేన మట్టి గణేష్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలు, స్థానికులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను అందరూ కలిసి జరుపుకోవడంతో కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో యువసేన మట్టి గణేష్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. సద్దుల బతుకమ్మ సంబరాలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి.

## దుర్గామాత వద్ద అన్నదాన ప్రసాదం



**దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేసిన గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నూకం రాజు ముదిరాజ్ , పాలకవర్గం సభ్యులు**

**మంచాల వెలుతురు అక్టోబర్ 18:** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రా త్రి వేణుగోపాలస్వామి భజన మండలి ఆధ్వర్యంలో ప్రతిష్టించిన దుర్గామాత మండపం ప్రాంగ ణంలో.దాతల సహకారంతో అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు ముందుగా దుర్గామాత కు ప్రత్యేక పూజలు చేసిన గ్రామ సర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్ ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరిఎల్లేష్ గ్రామపంచాయతీ పాలకమం డలిసభ్యులు పెద్దలు మారగోని మాసయ్యగౌడ్ గోగిరెడ్డి అంజిరెడ్డి మాజీఎంపిటిసి చీరాల రమే ష్ ప్రజాసంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ అనం తరం భక్తులకు అన్నప్రసాదం కార్యక్రమం ప్రారంభించారు అన్నప్రసాద కార్యక్రమానికి విచ్చేసిన ప్రజాప్రతినిధులను గ్రామ పెద్దలను వేణుగోపాల స్వామిభజన మండలి సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు ఈకార్యక్రమంలో అన్నప్రసాద ప్రభువులు గ్రామపంచాయతీ వార్డుస భ్యులు పున్నం రాము పంది శేఖర్ కొండిగారి శ్రావణ్ కుమార్ మంకు మమతా వినోద్ మంద మాధవి మోహన్ రెడ్డి,మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్ మాడుగుల బాలమణి కృష్ణగౌడ్ మొర్రిపద్మ ఐలయ్య,లాలగారి మణెమ్మ వేణుగోపాలస్వామి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు అన్నప్ర సాద దాతలు నూతనగంటి రాకేష్ జ్ఞాపకార్థంగా నాలుగు క్వింటాల బియ్యం దాత నూతన గం టి లక్ష్మయ్య కూరగాయల దాత మాధగోని ఎల్లేష్ గౌడ్ టెంట్ సామాగ్రి దాత మహమ్మద్ ఇమ్రా న్ ఖాన్ మాధగోని కాటంరాజు గౌడ్ 10వేలు లైఫ్ క్యూర్ మెడిక ల్ షాప్ మహమ్మద్ రాహుపు 10 వేలు పొలమోని శివమణి ముదిరాజ్ 10వేలు అంతటి శ్యామ్ గౌడ్ 10వేలు పల్లవి డీజే సౌండ్ గుడ్డిమల్ల భాస్కర్ ముదిరాజ్ 10వేల రూపాయలు ఇంకా చాలామంది దాతలు అన్నప్ర సాద కార్యక్ర మానికి విరాళాలు అందజేశారు ఈసందర్భంగా అన్నప్రసాద కార్యక్రమానికి సహక రించిన ప్రతి ఒ క్కరికి వేణుగోపాల భజన మండలి తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈకార్యక్రమంలో భక్తులు గ్రామస్తులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు



## కరీంనగర్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

- సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మేయర్ కొలగాని శ్రీనివాస్ దంపతులు.

**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 18:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా, ప్రకృతిని ఆరాధించే సద్దుల బతుకమ్మ పండుగ కరీంనగర్ నగరంలో కన్నులపండుగలా సాగింది. నగరంలోని తీగలగుట్టపల్లిలో







గల అమ్మవారి ఆలయం వద్ద నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ దంపతులు కుటుంబ సమేతంగా వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. మేయర్ దంపతులు వివిధ తీరొక్క పూలతో అందంగా బతుకమ్మను పేర్చి... బతుకమ్మను ఆలయం వద్ద పెట్టి సాంప్రదాయ ఉయ్యాల పాటలు, బతుకమ్మ పాటలకు మహిళలతో కలిసి మేయర్ కొలగాని శ్రీనివాస్ ఉత్సాహంగా బతుకమ్మ ఆడుతూ..సందడి చేశారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాటా డుతూ...నగర ప్రజలందరికీ మేయర్ కొలగాని శ్రీనివాస్ సద్దుల బతుకమ్మ, విజయదశమి (దసరా) పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నగర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని గౌరమ్మను వేడుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని బతుకమ్మ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు.

## ఈసీ శేఖర్ గౌడ్ మామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ

**ఇబ్రహీంపట్నం వెలుతురు అక్టోబర్ 18:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆదిభట్ల కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు ఈసీ శేఖర్ గౌడ్ మా మ వ్యవసాయ క్షేత్రంలో శేఖర్ గౌడ్ మామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దసరా పండుగ సందర్భం గా పేదలకు కార్మికులకు దుస్తులు పంపిణీ చేసిన ఈసి శేఖర్ గౌడ్ మామ ఈ సందర్భంగా మా ట్లాడుతూ గత 41ఏండ్ల నుండి మా కుటుంబం తరపున పేద ప్రజలకు ప్రతి ఏడాది దసరా పం డుగకు కొత్త దుస్తులు పంపిణీ చేస్తున్నాం అనిఅన్నారు ఆదిభట్ల గ్రామమే కాకుండా చుట్టుప్రక్క ల గ్రామాల ప్రజలు కూడా దుస్తులు పంపిణీ చేస్తున్నాం అని అన్నారు మా కుటుంబం నుండి సంప్రదా యంగా వస్తున్న ఈ వారసత్వాన్ని నాకుమారులు వరుణ్ గౌడ్ మరియు టి పిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ దేవా గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్తు న్నారు అని అన్నారు ప్రజల కండల్లో సంతోషం చూడాలని ఉద్దేశంతో ప్రతి ఏడాది దసరా పం డుగకు కొత్త దుస్తులు పంపిణీ చేస్తున్న అని అన్నారు సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలకు ఈసీ శేఖర్ గౌడ్ మామ దసరా శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఇబ్రహీంప ట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి యాచారం మండలం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు. ఉప్పరిగూడ వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఏదుళ్ళ పాండురంగా రెడ్డి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు



# నేచురల్ డైమండ్ బ్రాండ్ 'జూరి' ప్రారంభం



## దుర్గామాత మండపాలను సందర్శించిన బండి రమేష్

కూకట్ పల్లి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి బండి రమేష్ శనివారం నియోజకవర్గంలోని పలు దుర్గామాత మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూసాపేట్ డివిజన్‌లోని శ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని, ఆలయ కమిటీ చైర్మన్ రాచమళ్ల భిక్షపతి గౌడ్, ఆర్. శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. అంబేద్కర్ నగర్‌లో శివ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని సందర్శించారు. కైతలాపూర్ డివిజన్ ప్రగతి నగర్‌లో జిట్టా సునీల్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాన్ని సందర్శించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆంజనేయ నగర్, శ్రీ సీతారామ కల్యాణ మండపాల్లోని దుర్గామాత మండపాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. పండుగలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు తూము వేణు, పటోళ్ల నాగిరెడ్డి, తూము ఎల్లారావు, కర్క పెంటయ్య, తూము మనోజ్ కుమార్, తూము సంతోష్, కాలికోట శంకర్, సలీం, ఎండీ చున్ను పాషా, కాస నర్సింహా యాదవ్, తదితరులు, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## ఆరుటలో శ్రమదానం



**మంచాల వెలుతురు అక్టోబర్ 18:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోని లేని నగర్ ఎల్లమ్మ దేవాలయం వద్ద ప్రభుత్వ వైద్యశా ల ముందు ఉన్న ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ గడ్డి ఎత్తుగా పెరిగి విద్యుత్ వైర్లకు ఆనుకొని విద్యుత్ అంతరాయం అవుతుందని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని తెలుసుకున్న ఇబ్రహీంప ట్నం నియోజకవర్గం ప్రజాసంఘాలనాయకుడు కంబాలపల్లి భాస్కర్ ప్రమాదకంగా మారిన చె త్తాచెదారాన్ని శ్రమదానం చేసి తొలగించారూ ఈ కార్యక్రమంలో ఆయన వెంట శ్రమదానం చేసి న కాలనీవాసులు ముత్యాలు గ్రామస్తులు వనపల్లి శేఖర్ రెడ్డి ఏర్పుల జగన్ ఎండి జబ్బార్ మంకు పాండు అలువాల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## దాద్‌పల్లిలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన దుర్గామాత వద్ద ఘనంగా ప్రత్యేక పూజలు



**మంచాల వెలుతురు అక్టోబర్ 18:**
మంచాల మండలం దాద్ పల్లి గ్రామంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఫ్రెండ్స్ యూ త్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన దుర్గామాత మండపంలో పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు దు ర్గాదేవి మాల ధరించిన భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు కుంకుమ అర్చన కార్యక్రమం ని ర్వహించారు ఈ పూజాకార్యక్రమంలో గ్రామ పెద్దలు వివిధ సంఘాల యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

### రాబోయే ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా 25 స్టోర్ల ఏర్పాటు లక్ష్యం





**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 18**
వజ్రాభరణాలకు ప్రసిద్ధి చెందిన నేచురల్ డైమండ్ జ్యువెలరీ బ్రాండ్ 'జూరి' మొట్టమొదటి రిటైల్ అవుట్లెట్ను రాజ్ భవన్ రోడ్లో వ్యవస్థాపకులు సాయి వినీత్, మహేష్ చౌదరి, అంకుష్ సురానా ప్రారంభించారు. ఈ సందర్భంగా జూరి వ్యవస్థాపకుడు మహేష్ చౌదరి మాట్లాడుతూ రాబోయే ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా 25 స్టోర్లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందులో భాగంగా రాబోయే మూడు నెలల్లో హైదరాబాద్లో నాలుగు అవుట్లెట్లను ప్రారంభించనున్నామని చెప్పారు. వినియోగదారుల ఆకాంక్షలు, ప్రాధాన్యతలను ప్రతిబింబించేలా ఈ షోరూమ్ను రూపొందించామన్నారు. ఇందులో వీఐపీ లాంజ్ కూడా ఉందన్నారు. రిటైల్ నెట్వర్క్ను విస్తరిస్తున్న క్రమంలో రాబోయే అవుట్లెట్లలో కూడా ఇదే డిజైన్ విధానాన్ని కొనసాగిస్తామన్నారు. జూరి ఫ్యాషన్ జ్యువెలరీ నిత్య జీవితం కోసం రూపొందించబడిందని చెప్పారు. ట్రెండీ, సమకాలీన డిజైన్లతో పాటు బహుముఖ వినియోగానికి అనువుగా ఉంటాయన్నారు. ఆఫీస్ పని, వ్యాయామం, డిన్నర్లు, సినిమా నైట్లు ఇలా ప్రతి సందర్భానికి, జీవనశైలికి మా ఆభరణాలు చక్కగా సరిపోతాయని తెలిపారు. ఇది మొట్టమొదటి రిటైల్ అవుట్లెట్ అన్నారు. రాబోయే ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా 25 స్టోర్లను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా జూరి వ్యవస్థాపకుడు సాయి వినీత్ మాట్లాడుతూ.. నాణ్యత, సమకాలీన డిజైన్, పారదర్శకతను వినియోగదారులకు ఉపయోగపడే ప్రయోజనాలతో మిళితం చేస్తూ సహజ సిద్ధమైన డైమండ్ ఆభరణాలను రోజువారీ జీవితంలో అంతర్భాగం చేయడంపై దృష్టి సారిస్తున్నామన్నారు. రెండో స్టోర్ దీపావళికి ముందే కొంపల్లిలో ప్రారంభించనున్నామన్నారు. ఆ తర్వాత హైదరాబాద్ అంతటా, దేశవ్యాప్తంగా విస్తరించాలని యోచిస్తున్నామ న్నారు. జూరి వ్యవస్థాపకుడు అంకుష్ సురానా మాట్లాడుతూ ఒక్కసారి లావాదేవీలకే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక సంబంధాలను పెంపొందించే ఉద్దేశంతో రూపొందించిన 'కస్టమర్-కేర్ ప్రోగ్రామ్' జూరికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందన్నారు. జూరి సోమాజిగూడ అవుట్లెట్ ఫ్రాంచైజీ భాగస్వాములు శ్రీధర్ బొనాల, చంద్రహాస్ ఇన్నమూరి, సురేష్‌కుమార్ ఎన్నమూరి మాట్లాడుతూ 'జూరి' సమకాలీన జీవనశైలి డిజైన్లను సహజ సిద్ధమైన వజ్రాలు, అసలైన రత్నాలు, నాణ్యమైన బంగారు ఆభరణాలతో మిళితం చేస్తుందన్నారు. వివిధ రకాల శైలులు, ప్రాధాన్యతలు, సందర్భాలకు అనుగుణంగా 18 క్యారెట్లు, 14 క్యారెట్లు, 9 క్యారెట్లలో బీఐఎస్-హాల్మార్క్ బంగారు ఆభరణాలు, ఐజీఐ-ధృవీకృత డైమండ్ ఆభరణాలు అందిస్తు న్నామన్నారు.

## పట్టభద్రుల పోరులో కాంగ్రెస్ జెండా ఎగరాలి

### సామ రామ్మోహన్ రెడ్డి విజయానికి సరిత తిరుపతయ్య పిలుపు



**గద్వాల, వెలుతురు అక్టోబర్ 18**
రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయమే లక్ష్యంగా నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేస్తూ, కాంగ్రెస్ విధానాలు, ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. సామ రామ్మోహన్ రెడ్డిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## భవానీనగర్ కాలనీలో సద్దుల బతుకమ్మ సంబురాలు



### దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

**ఉప్పల్, అక్టోబర్ 18(వెలుతురు):**
ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని భవానీనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జరుగుతున్న 22వ వార్షిక శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు ఆధ్యాత్మిక శోభతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు శ్రీ దుర్గాదేవి రూపంలో భక్తులకు భక్తిప్రపత్తులతో దర్శనమిచ్చారు. సాయంత్రం కాలనీ మహిళలు కమ్యూనిటీ హాల్ ఆవరణలో సద్దుల బతుకమ్మ వేడుకలను అత్యంత ఘనంగా జరుపుకున్నారు. బతుకమ్మల ఆటపాటలతో ప్రాంగణమంతా పండుగ వాతావరణం సంతరించుకుంది. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ కన్వీనర్ నల్ల అనిత, కో-కన్వీనర్ కొండోజు పద్మ మాట్లాడుతూ.. సోమవారం అమ్మవారు శ్రీ మహిషాసురమర్దిని దేవిగా, మంగళవారం శ్రీ రాజేశ్వరీ దేవిగా అలంకరింపబడతారని వెల్లడించారు. అలాగే మంగళవారం సాయంత్రం శమీపూజ (జమ్మి ఆకు పూజ), రావణ దహనం (కాష్టం), దాండియా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ఉత్సవ కమిటీ ప్రతినిధులు సుధారాణి, శేషవాణి, నమ్ముల సదాలక్ష్మి, నవితారెడ్డి, దేవి, వనజ, కె. సరస్వతి, ఎం. లావణ్య, ఎం. నాగలక్ష్మి, కాలనీ అధ్యక్షుడు, కార్యదర్శులు జి. కృష్ణారెడ్డి, చిరంజీవి, మాజీ అధ్యక్షుడు కొత్త అంజిరెడ్డి, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు కళాశాలల్లో విద్య కంటే ఈవెంట్లు, సినిమా ప్రమోషన్లకే ప్రాధాన్యత



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 18:**
ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో లైటింగ్ సిస్టం కూలి మృతి చెందిన సోనా కుటుంబానికి రూ. 50 లక్షల నష్టపరిహారం చెల్లించాలి --- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ డిమాండ్
ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన యాజమాన్యాలు,అందుకు భిన్నంగా ప్రైవేట్ ఈవెంట్లు,సినిమా ప్రమోషన్ల నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం ఆందోళనకరమని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో దాండియా కార్యక్రమం సందర్భంగా లైటింగ్ సిస్టం కూలి సోనా మృతి చెందిన ఘటనపై ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కళాశాల యాజమాన్యంపై ఉందని పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై సమగ్ర విచారణ జరిపి,బాధ్యతను నిర్ధారించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన సోనా కుటుంబానికి కళాశాల యాజమాన్యం రూ. 50 లక్షల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రతా ప్రమాణాలు సక్రమంగా అమలవుతున్నాయా లేదా అనే విషయంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు,రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు

## పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా వెంకటేశ్వర రావు నియామకం



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 18:**
పిఆర్టియు టి ఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా కూకట్ పల్లి కి చెందిన ఎం. వెంకటేశ్వర రావు నియమితులైయ్యారు. ఇటీవల సంఘం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ లో కూకట్ పల్లి మండలం అల్విన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో టీచర్ గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర రావు కు చోటుదక్కింది. కూకట్ పల్లి చెందిన వెంకటేశ్వర రావు రాష్ట్ర కమిటీ కి ఎన్నిక కావడం పట్ల కూకట్ పల్లి టీచర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. తాను రాష్ట్ర కమిటీ కి ఎన్నిక కావడానికి సహకరించిన ఉపాధ్యాయులదరికి, సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



## హిమాయత్ నగర్ డివిజన్‌లో కన్యపుజన్

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 18:**
ఆదివారం రోజున దేవీ నవరాత్రుల్లో భాగంగా అష్టమి సందర్భంగా హిమాయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ డివిజన్లోని వివిధ చోట్లలో కన్యపుజన్ నిర్వహించి వారికి భోజనం చేయించడం జరిగింది . ఈ కార్యక్రమంలో బాలికలు ఉత్సా హంగా పాల్గొన్నారు.

## అమ్మవారి మండపాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు

**బషీర్బాగ్ వెలుతురు 18 అక్టోబర్ :**
జగన్మాత యూత్ అసోసియేషన్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి మండపాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వయించిన అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ , బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బి. వెంకటరెడ్డి , కార్పొరేటర్ శ్రీమతి బి. పద్మా వెంకటరెడ్డి కార్యక్రమంలో ఆహ్వానించి సత్కరించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మిర్యాల శ్రీనివాస్ మరియు భక్తులు పాల్గొన్నారు




## సైబర్ దాండియా సంస్కృతి, సైబర్ అవగాహనల సమ్మేళనం

**సైబరాబాద్ వెలుతురు అక్టోబర్ 18:**
ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించడంతో పాటు పోలీస్--ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో సైబరాబాద్ పోలీసులు "సైబర్ దాండియా" కార్యక్రమాన్ని నిర్వహించారు. సాంస్కృతిక వేడుకలను ముఖ్యమైన సైబర్ భద్రత సందేశాలతో మేళవిస్తూ ఈ కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించారు.

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ డా. యం. రమేష్ నాయకత్వంలో, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ూజూజ), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన (జవీజ) సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబరాబాద్ డీసీపీ సైబర్సైబర్ క్రైమ్స్ శ్రీమతి పుష్ప ఈ కార్యక్రమానికి మార్గనిర్దేశం చేస్తూ సమన్వయం చేశారు. సైబరాబాద్ పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు.

ప్రభుత్వ అధికారులు, పోలీస్ సిబ్బంది, ఐటీ కంపెనీల ప్రతినిధులు, యువత, మహిళలు, కుటుంబ సభ్యులు, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 1500 మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా సైబరాబాద్ సి పి రమేష్ మాట్లాడుతూ.. సాంస్కృతిక వేడుకలతో పాటు సైబర్ భద్రతపై అవగాహనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో "సైబర్ దాండియా" కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సైబర్ దాండియా వంటి కార్యక్రమాల ద్వారా పోలీసులు ప్రజలతో నేరుగా మమేకమై, కొత్తగా వెలుగుచూస్తున్న సైబర్ ముప్పులు, వాటి నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించవచ్చన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), డిజిటల్ టూల్స్, వీడియోలు, ప్రాక్టికల్ డెమాన్‌స్ట్రేషన్లను వినియోగించినట్లు తెలిపారు. వివిధ రకాల సైబర్ నేరాలు, నేరగాళ్లు అనుసరిస్తున్న విధానాలు (వీశీఎబం ూజూవతీఖఅఎఱ), వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు సరళంగా, ఆసక్తికరంగా, సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు.

సాంకేతికతతో రోజువారీ జీవితం సులభతరమైనప్పటికీ, సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేసేందుకు ఎప్పటికప్పుడు కొత్త పద్ధతులను అవలంబిస్తున్నారని సీపీ తెలిపారు. డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ మరియు ట్రేడింగ్ మోసాలు, ఫిషింగ్, స్మిషింగ్, ఓటీపీ మోసాలు, ఫేక్ లింకులు, పార్ట్‌టైమ్ జాబ్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



ఓటీపీ లు, పాస్‌వర్డ్‌లు,ూ×చీలు లేదా బ్యాంకింగ్ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని సీపీ సూచించారు. ముఖ్యంగా అసాధారణంగా అధిక లాభాలు వస్తాయని చెప్పే ఆన్‌లైన్ పెట్టుబడి ఆఫర్లను నమ్మేముందు తప్పనిసరిగా ధృవీకరించుకోవాలన్నారు. సైబర్ మోసానికి గురైన సందర్భంలో బాధితులు వెంటనే స్పందించి 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

సైబరాబాద్ డీసీపీ క్రైమ్స్ శ్రీమతి పుష్ప మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు ప్రజల్లోని భయం, అత్యాశ, నమ్మకాన్ని ఆసరాగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, వీడియో కాల్స్, అనుమానాస్పద ూూఖ ఫైల్స్, లింకులు, నకిలీ పెట్టుబడి పథకాలు, పార్ట్‌టైమ్ ఉద్యోగ ఆఫర్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.





"క్లిక్ చేసే ముందు ఆలోచించండి -- నమ్మే ముందు ధృవీకరించండి" అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని ఆమె సూచించారు.

సైబర్ దాండియా వేడుకల్లో యువత, మహిళలు, కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్సాహభరితమైన దాండియా ప్రదర్శనలను సైబర్ భద్రత అవగాహనతో మేళవించడం ద్వారా, ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహనను ఆసక్తికరంగా, సులభంగా అర్థమయ్యే రీతిలో చేరవేశారు.

ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ డా. యం. రమేష్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, అన్నపూర్ణ డి సి పి అడ్మిన్, డీసీపీ సైబర్ క్రైమ్స్ శ్రీమతి పుష్ప; డీసీపీ శ్రీమతి లావణ్య; కూకట్‌పల్లి డీసీపీ శ్రీమతి రితిరాజ్, ఐపీఎస్; ట్రాఫిక్-×× డీసీపీ శ్రీమతి ఎస్. శేషాద్రిని రెడ్డి, ఐపీఎస్; శేరిలింగంపల్లి జోన్ డీసీపీ శ్రీ చ. శ్రీనివాస్, ఐపీఎస్; కార్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ శ్రీ పి. సంజీవ్ తదితర ఉన్నతాధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ూజూజ, జవీజ ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఐటీ కంపెనీల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

సుమారు 1500 మంది పాల్గొనడంతో "సైబర్ దాండియా" కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమం ద్వారా "సురక్షితంగా సంబరాలు జరుపుకోండి -- సైబర్ ప్రపంచంలో సురక్షితంగా ఉండండి" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.

### అంతర్జాతీయ సైకాలజీ సదస్సులో
## తెలంగాణ పరిశోధకుల పత్రానికి ప్రశంసలు

**రాజయోగ ధ్యానంపై అధ్యయనానికి అంతర్జాతీయ వేదికపై గుర్తింపు**




**కరీంనగర్, వెలుతురు, అక్టోబర్ 18 :** తెలంగాణకు చెందిన పరిశోధకులు అట్ల శ్రీనివాస్ రెడ్డి, డా. బి. రజనీ దేవి రూపొందించిన పరిశోధనా పత్రాన్ని 2వ అంతర్జాతీయ సైకాలజీ సదస్సు--2026లో అక్టోబర్ 18న సాయంత్రం 4:45 గంటలకు ఆన్‌లైన్ ద్వారా ప్రదర్శించారు. మాల్దీవ్స్‌లోని విల్లా కాలేజ్, క్యూ ఐ క్యాంపస్‌లో నిర్వహించిన ఈ సదస్సులో వారి పరిశోధనకు విశేష స్పందన లభించింది. కౌమారదశలో మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు భారతీయ సంప్రదాయ ధ్యాన పద్ధతుల అన్వయం-రాజయోగ ధ్యానం" అనే అంశంపై సాగిన ఈ అధ్యయనం, విద్యార్థుల్లో ఒత్తిడి, ఆందోళనను ఎదుర్కొనే సామర్థ్యం, భావోద్వేగ శ్రేయస్సు, మానసిక ప్రశాంతతను పెంపొందించడంలో రాజయోగ ధ్యానం పాత్రను పరిశీలించింది. ఈ సందర్భంగా అసోసియేట్ ప్రొఫెసర్ డా. అలీ నజీబ్, విల్లా కాలేజ్ సైకలాజికల్ అసోసియేషన్ అధ్యక్షులు తుగా షమీమ్, పరిశోధకులు అట్ల శ్రీనివాస్ రెడ్డి, డా. బి. రజనీ దేవికి అభినందనలు తెలియజేస్తూ, వారి పరిశోధన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# వైభవంగా సద్దుల బతుకమ్మ సంబరాలు







- **సర్పంచ్ సంతోష్‌కుమార్ దేశ్ముఖ్ పాల్గొని మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు**

**నారాయణఖేడ్, అక్టోబర్ 18 వెలుతురు:** నారాయణఖేడ్ నియోజకవర్గం లోని కంగ్టి మండల పరిధిలోని చౌకన్‌పల్లి గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.బతుకమ్మ ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్ సంతోష్ కుమార్ దేశ్ముఖ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు.మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో పండుగలను జరుపుకోవడం సంతోషకరమని తెలిపారు.అనంతరం మహిళలు చిన్నాపెద్దా తేడా లేకుండా బతుకమ్మల చుట్టూ చేరి కోలాటాలు, ఆటపాటలు, డీజే పాటలు, డప్పు చప్పుళ్లతో ఉత్సాహంగా సంబరాలు చేసుకున్నారు.పండుగ వాతావరణం నడుమ బతుకమ్మలకు పూజలు నిర్వహించి, సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేశారు. సర్పంచ్ సంతోష్ కుమార్ దేశ్ముఖ్ పాల్గొనడంతో వేడుకలు మరింత సందడిగా సాగాయి.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కవిత విజయ్ పటేల్,పార్టీ సీనియర్ నాయకులు రాజు పటేల్, ఉమాకాంత్ జన్వాడే,మాజీ సర్పంచ్ రఘు,సభ్యులు సంతోష్, మారుతి,కల్లప్ప,హనుమంతు, బాబు దేశాయ్.గ్రామ పెద్దలు యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు

### సద్దుల బతుకమ్మ వేడుకల్లో
## ఎమ్మెల్యే సందడి

**-కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్న కౌశిక్ రెడ్డి**



**హుజురాబాద్, వెలుతురు అక్టోబర్ 18 :** హుజూరాబాద్ నియోజకవర్గంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. తన సతీమణి శాలిని రెడ్డి, కుమార్తె శ్రీనికా రెడ్డితో కలిసి కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామం, హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాలు, వీణవంక మండల కేంద్రంలో జరిగిన వేడుకలకు హాజరయ్యారు.ఈ సందర్భంగా బతుకమ్మను పూజించి, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ విశిష్టతను చాటిచెప్పారు. ఆడబిడ్డలు, అక్కాచెల్లెళ్లకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, మహిళలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.



### రాక్ హిల్స్ కాలనీలో
# ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు





**నల్లగొండ, వెలుతురు, అక్టోబర్ 18:** నల్లగొండ పట్టణంలోని రాక్ హిల్స్ కాలనీలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో గండిచెర్వు కావ్య, గండిచెర్వు నివేదశ్రీతో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలు, చిన్నారులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి వేడుకల్లో సందడి చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ పాటలు పాడుతూ ఆడిపాడడంతో కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ పండుగ ప్రత్యేకతను చాటారు.కాలనీవాసులంతా కలిసికట్టుగా వేడుకల్లో పాల్గొని తెలంగాణ సంప్రదాయాలను ప్రతిబింబించారు. పూల పండుగ విశిష్టతను చాటుతూ బతుకమ్మను పూజించి, కుటుంబ సభ్యుల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. సద్దుల బతుకమ్మ వేడుకలతో రాక్ హిల్స్ కాలనీలో సందడి నెలకొనగా, అందరూ ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకున్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సద్దుల బతుకమ్మ





- **మక్తల్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు..**
- **పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి దంపతులు**

**మక్తల్, వెలుతురు, అక్టోబర్ 18 :** మక్తల్ పట్టణంలోని రామ్‌లీలా మైదానంలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరి దంపతులు పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో భాగస్వాములయ్యారు. రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల మధ్య మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటపాటలతో పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.... బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని, ప్రకృతిని ఆరాధిస్తూ పూలను పూజించే ఈ పండుగ మహిళల ఐక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతిబింబమని పేర్కొన్నారు. పూల పండుగగా ప్రసిద్ధి చెందిన బతుకమ్మ మన సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందని, తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.మక్తల్ పట్టణంలో కులమతాలకు అతీతంగా అన్ని పండుగలను కలిసిమెలిసి జరుపుకోవడం మంచి సంప్రదాయమని మంత్రి పేర్కొన్నారు. దసరా సందర్భంగా రావణ దహన కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో పాటు, బతుకమ్మ వేడుకల్లోనూ అదే స్థాయిలో ఉత్సాహంగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి పండుగలు సమాజంలో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తూ ప్రజల మధ్య ఆత్మీయ అనుబంధాలను బలోపేతం చేస్తాయని తెలిపారు.తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే సద్దుల బతుకమ్మ పండుగ ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు. మక్తల్‌లో పండుగలు ఐక్యతకు, సామరస్యానికి వేదికలుగా నిలవడం అభినందనీయమని మంత్రి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ వాకిటి మానస హన్మంతు, వైస్ ఛైర్ పర్సన్ శైవీ రెడ్డి, కౌన్సిలర్లు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

### అంబరాన్నింటిన
# సద్దుల బతుకమ్మ సంబురాలు





### ఆడిన ముసి ఒడ్డు సింగారం మహిళలు

**సూర్యాపేట జిల్లా వెలుతురు అక్టోబర్ 18:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ చివరి రోజైన సద్దుల బతుకమ్మ వేడుకలను సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం ముసి ఒడ్డున సింగారం మహిళలు ఘనంగా జరుపుకున్నారు.రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ పాటలు పాడుతూ మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని,మహిళలందరూ ఐకమత్యంతో ఈ వేడుకల్లో పాల్గొనడం సంతోషకరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జాజుల మాధవి నళిని అనిత విజయలక్ష్మి లావణ్య ఉపేంద్ర కల్పన మమత వర్షిని ప్రమీల ఉమా తదితరులు పాల్గొన్నారు.

### సంజయ్ గాంధీ నగర్‌లో
# ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

**సంప్రదాయ దుస్తులతో లయబద్ధంగా అడుగులు వేస్తూ, ఆటపాటలతో వేడుకలు**



**కుత్బుల్లాపూర్, వెలుతురు, అక్టోబర్ 18 :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం సర్కిల్ సూరారం డివిజన్ సంజయ్ గాంధీ నగర్ లో ఆదివారం సద్దుల బతుకమ్మ సంబరాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి పండగకు పూలతో దేవుడికి అర్చనలు పూజలు చేస్తే బతుకమ్మ వేడుకల్లో మాత్రం రకరకాల పూలను సేకరించి అందమైన బతుకమ్మలను పేర్చి ఆ పువ్వులకే పూజలు నిర్వహించడం మన సాంప్రదాయం. అందుకే గునుగు, తంగేడు, చామంతి, గడ్డిపూలు వంటి అనేక రకాల పూలను సేకరించి అందమైన బతుకమ్మలుగా పేర్చి వాటికి పూజలు నిర్వహించిన అనంతరం స్థానిక మహిళలంతా సంప్రదాయ దుస్తులను ధరించి అచ్చమైన తెలుగుదనం ఉట్టి పడేలా అందంగా ముస్తాబై ఆ మహిళలంతా ఆ బతుకమ్మలను ఒక్కచోట ఏర్పాటు చేసి బతుకమ్మల చుట్టూ సంప్రదాయమైన పాటలు పాడుతూ లయబద్ధంగా అడుగులు వేస్తూ బతుకమ్మ సంబరాలు చేసుకోవడం మన ఆనవాయితీ. తెలుగు ప్రజల ఆనవాయితీ ప్రకారం సంజయ్ గాంధీ నగర్ లో బాలరాజు యాదవ్ ఇంటి ముందు ప్రత్యేకంగా బతుకమ్మల వేడుకలకు ఏర్పాటుచేసిన విద్యుత్ కాంతుల మధ్య స్థానిక కాలనీ మహిళలు బతుకమ్మ సంబరాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. పూర్వకాలం నుంచి వస్తున్న బతుకమ్మలను కొలిచే ప్రత్యేక పాటలను పాడుతూ అందుకు అనుగుణంగా లయబద్ధంగా అడుగులు వేస్తూ అత్యంత వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహించి అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ కొలనులలో సద్దుల బతుకమ్మలను, గౌరమ్మదేవిలను నీటిలో వదిలి పోయిరావమ్మా గౌరమ్మ వచ్చే సంవత్సరం వరకు మా పిల్లాపాపలను, కుటుంబాలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. ఈ వేడుకలలో లావణ్య, శోభారాణి, లక్ష్మి జయ, కృష్ణవేణి, సౌజన్య, స్రవంతి, మాధవి, జ్యోతి, సంధ్య, శిరీష, కృతిక, పద్మ, మమత, లక్కీ, వైష్ణవి, శ్రావణి, అనూష, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు





**చేవెళ్ల, వెలుతురు అక్టోబర్ 18 :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండల పరిధిలోని నాగర్‌గూడ గ్రామ సర్పంచ్ బండ సరూప మహేందర్ గౌడ్ ఘనంగా ఏర్పాట్లు చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతిరూపమైన బతుకమ్మ వేడుకలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపాయి..తీరొక్క పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో మహిళలు, యువతులు వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. పూల పండుగగా పేరొందిన బతుకమ్మ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు.తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో బతుకమ్మను పూజించిన మహిళలు, సద్దుల బతుకమ్మ రోజున ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించారు.. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మ పండుగను నాగర్‌గూడ గ్రామంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించడంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాలను కాపాడుతూ, భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని గ్రామస్థులు పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ఆడపడుచులు తదితరులు పాల్గొన్నారు.

### భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో
# బతుకమ్మ సంబరాలు



చేవెళ్ల, **వెలుతురు, అక్టోబర్ 18 :** :- చేవెళ్ల మండల కేంద్రంలో భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వడ్ల మంజుల హాజరై సద్దుల బతుకమ్మ సంబరాలలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సద్దుల బతుకమ్మ అని అన్నారు. తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకునే సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా తెలంగాణ ఆడపడుచులందరికీ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నా మన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రకృతిని పూజిస్తూ, పూలను దేవతగా కొలుస్తూ మహిళలు ఐకమత్యంతో జరుపుకునే ఈ పండుగ మన రాష్ట్ర ప్రత్యేకతను చాటిచెబుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ బతుకమ్మ పండుగ ప్రజలను ఏకం చేయడంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని, మహిళలకు సమాన హక్కులు, గౌరవం, భద్రత కల్పించాలని, మహిళా సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ప్రకృతిని పరిరక్షిస్తూ, పర్యావరణానికి హాని కలగకుండా పండుగను జరుపుకోవాలని కోరారు. సద్దుల బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాలు నింపాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో లలిత, వెంకటమ్మ, మాధవి, జయమ్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాష్టమి వేళ ఆయుధ పూజలు



- పోలీసు ఆయుధాలు, పెట్రోలింగ్ వాహనాలకు ప్రత్యేక పూజలు
- సిబ్బంది ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి : సీపీ సజ్జనర్

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 18 :** హైదరాబాద్ పేట్ల బురుజులోని సీఏఆర్ హెడ్క్వార్ట ర్స్‌లో దసరా నవరాత్రి దుర్గాష్టమి సందర్భంగా నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్, ఆదివారం ఆయుధ, వాహన పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మరీలోని ఆయుధాలకు, నిరంతరం శాంతిభద్రతల పరిరక్షణలో సేవలందించే పోలీస్ పెట్రోలింగ్ వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆయుధ పూజ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దుర్గా మాత దివ్య ఆశీస్సులతో పోలీస్ అధికారులందరూ, సిబ్బంది ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో ఉండే సిబ్బంది విధి నిర్వహణలో ఎలాంటి మానసిక ఒత్తిడికి లోనుకాకుండా, ప్రశాంత వాతావరణంలో బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. హైదరాబాద్ సిటీ పోలీసు అధికారులకు, సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు దుర్గాష్టమి, విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు ఆర్. వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీనివాస్, చైతన్యకుమార్, రమణా రెడ్డి, రాఘవేందర్ రెడ్డిలతో పాటు పలువురు ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## తీర్పులు కాగితాలకే పరిమితమా?

- రుతుక్రమ ఆరోగ్యంపై రాష్ట్రాల నిర్లక్ష్యం
- స్పందించకుంటే ప్రధాన కార్యదర్శులకు ధిక్కరణ నోటీసులు
- బాలికల ఆరోగ్యం, విద్యపై సుప్రీంకోర్టు ఆందోళన



**న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 18 :** బాలికల రుతుక్రమ ఆరోగ్యం, పరిశుభ్రతపై తాము ఇచ్చిన తీర్పును అమలు చేయడంలో రాష్ట్రాలు, కేంద్రపా లిత ప్రాంతాలు నిర్లక్ష్యం వహించడంపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కేంద్రం కోరినా వివరాలు సమర్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం.. తదుపరి విచారణ నాటికి స్పందించకపోతే సంబంధిత రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించింది. కేసు విచారణను డిసెంబర్ 14కు వాయిదా వేసింది.

**ప్రాథమిక హక్కులో భాగం**

జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం అక్టోబర్ 13న ఈ అంశంపై విచారణ జరిపింది. రాజ్యాంగంలోని 21వ అధికరణం కల్పించిన జీవించే హక్కులో రుతుక్రమ ఆరోగ్యం, పరిశుభ్రత కూడా భాగమని స్పష్టం చేసింది. సెప్టెంబర్ 1న ఇచ్చిన ఆదేశాల మేరకు తీర్పు అమలుకు తీసుకున్న చర్యల వివరాలను రాష్ట్రాలు సమర్పించాల్సి ఉన్నప్పటికీ స్పందన రాకపోవడంపై అసహనం వ్యక్తం చేసింది. తీర్పులో పేర్కొన్న అంశాలు కాగితాలకే పరిమితమైతే బాలికలకు ప్రాథమిక హక్కులు ఎలా అందుతాయని ప్రశ్నించింది. కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి.. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను వివరాలు కోరినా స్పందించలేదని కోర్టుకు తెలిపారు. దీంతో చర్యలపై లిఖితపూర్వక సమాచారం సేకరించి సమర్పించాలని కేంద్రాన్ని ధర్మాసనం ఆదేశించింది.

**పాఠశాలల్లో సదుపాయాలు తప్పనిసరి**

రుతుక్రమ పరిశుభ్రతకు అవసరమైన వసతులు లేకపోవడంతో మారుమూల ప్రాంతాల్లోని బాలికలు చదువుకు దూరమవుతున్నారని సుప్రీంకోర్టు పేర్కొంది. పాఠశాలల్లో బాలురు, బాలికలకు వేర్వేరు మరుగుదొడ్లు, నీటి సదుపాయం, పరిశుభ్రత, గోప్యత ఉండేలా చూడాలని ఆదేశించింది. ఈ ఏడాది జనవరి 30న ఇచ్చిన తీర్పులో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలికలకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్లు అందించాలని కూడా స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా నీటి సదుపాయంతో కూడిన 30,458 మరుగుదొడ్లు నిర్మించినట్లు, మరో 4,236 నిర్మాణంలో ఉన్నట్లు కేంద్రం గతంలో కోర్టుకు తెలిపింది. అయితే నిర్మాణాలతోపాటు వాటి నిర్వహణ, వాస్తవ వినియోగంపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

**అమలుతోనే హక్కులకు రక్షణ**

రుతుక్రమంపై అవగాహన కొరవడటం, పరిశుభ్రతకు అవసరమైన వస్తువులు, పాఠశాలల్లో సరైన వసతులు లేకపోవడం బాలికల ఆరోగ్యం, విద్యపై ప్రభావం చూపుతున్నాయి. ఉచిత శానిటరీ న్యాప్‌కిన్ల పంపిణీ, మరుగుదొడ్ల నిర్వహణ, ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో ప్రభుత్వాలు చొరవ చూపాలి. సుప్రీంకోర్టు ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలైనప్పుడే బాలికలకు ఆరోగ్యం, గౌరవం, సమాన విద్యావకాశాలు అందుతాయి.

## ఓటు చోరీకి మోదీ ప్లాన్.. అమిత్ షా అమలు



**మర్గావ్, వెలుతురు అక్టోబర్ 18:** ఓట్లచోరీకి పాల్పడుతున్న ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ త్వరలోనే చట్టం ముందు నిలవాల్సి వస్తుందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. వారు తమ తప్పులకు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. గోవాలోని మర్గావ్‌లో జరిగిన కాంగ్రెస్ గోయ్ రఖోన్ యాత్రలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. కాంగ్రెస్ శ్రేణులతో కలిసి 2కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించిన రాహుల్ జ్ఞానేశ్ కుమార్ ఓట్ల చోరీకి పాల్పడుతుంటే మోదీ, అమిత్ షా ఆయనకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ రాజ్యాంగాన్ని పరిరక్షించే శక్తి అని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్‌లను వదిలిపెట్టేది లేదని రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు.

**అదానీ, అంబానీలకు ప్రయోజనాలు**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొందరు పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని రాహుల్ ఆరోపించారు. గౌతమ్ అదానీ, ముఖేశ్ అంబానీలకు మేలు చేకూర్చేలా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, భూములు, ఇతర ఆర్థిక అవకాశాలను కట్టబెడుతున్నారని విమర్శించారు. ప్రతిఫలంగా ఆయా పారిశ్రామికవేత్తలు ప్రభుత్వానికి ప్రచారం కల్పిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం కొందరు బిలియనీర్లకు డబ్బు, కాంట్రాక్టులు, భూములు అందిస్తూ, వారి ద్వారా రాజకీయ ప్రచార ప్రయోజనాలు పొందుతోందని వ్యాఖ్యానించారు. దేశంలో ప్రభుత్వ వ్యవస్థ పనిచేస్తున్న తీరుపై ప్రశ్నలు లేవనెత్తారు.

**'గోవాలో భూములు లాక్కుంటున్నారు'**

గోవాలో రైతులు, పేదలకు చెందిన భూములను ప్రభుత్వం లాక్కొని బయటి వ్యక్తులకు అప్పగిస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రాంతీయ మాస్టర్ ప్లాన్ రద్దు నేపథ్యంలో ప్రభుత్వానికి సన్నిహితులైన వారికి భూములు కట్టబెట్టే పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు. రాష్ట్ర సహజ సంపద, సాంస్కృతిక వారసత్వాన్ని ఆర్థిక ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. దేశంలో అత్యధిక నిరుద్యోగం ఉన్న రాష్ట్రంగా గోవా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు లేక యువత విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఉద్యోగ కల్పన వ్యవస్థను బీజేపీ ప్రభుత్వం దెబ్బతీసిందని విమర్శించారు. గతంలో నరేంద్ర మోదీ హయాంలో గుజరాత్ నమూనా గురించి మాట్లాడేవారని, ఇప్పుడు గోవాలో అవినీతి నమూనా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు.

## చైనా ఏజెంట్లకు రహస్య సమాచారం లీక్



**గాంధీనగర్, వెలుతురు అక్టోబర్ 18 :** చైనా నిఘా సంస్థలు, వాటి ఏజెంట్లకు అత్యంత సున్నితమైన, వ్యూహాత్మక సమాచారాన్ని అందించారనే ఆరోపణలపై ఒక సీనియర్ ఆర్మీ అధికారి భార్యపై జమ్మూ కశ్మీర్ పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యావేత్తల ముసుగులో తనను సంప్రదించిన విదేశీ ఏజెంట్ల వలలో ఆమె తెలియకుండానే చిక్కుకున్నట్లు సమాచారం. తెలంగాణకు చెందిన సదరు మహిళ ప్రస్తుతం జమ్మూలోని గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్నారు. ఆమెతో మాట్లాడిన వ్యక్తులు విద్యావేత్తలు కారని, వారు చైనాకు చెందిన నిఘా ఏజెంట్లని ఆమె గుర్తించలేకపోయారని తెలుస్తోంది. ఈ ఘటనపై గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో అధికారిక రహస్యాల చట్టం 1923లోని సెక్షన్లు 3, 5 తో పాటు భారతీయ న్యాయ సంహిత లోని సెక్షన్లు 152, 61(2) కింద ఎఫ్ఐఆర్ నమోదైంది. అధికారిక రహస్యాల చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం జాతీయ భద్రతకు భంగం కలిగించే సమాచారాన్ని సేకరించడం లేదా చేరవేయడం నేరం... సెక్షన్ 5 రక్షిత సమాచారాన్ని చట్టవిరుద్ధంగా చేరవేయడం, అట్టిపెట్టుకోవడం, నిర్వహించడం నేరంగా పరిగణిస్తుంది. నిఘా సంస్థల ప్రాథమిక విచారణ ప్రకారం... కొందరు చైనా ఏజెంట్లు విద్యావేత్తలుగా నటిస్తూ ఆ మహిళను సంప్రదించి, ప్రచురణల కోసం వ్యూహాత్మక, కార్యాచరణ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై వ్యాసాలు రాయమని కోరారు. తొలుత ఆమెతో పర్యావరణం, భౌగోళిక రాజకీయాలకు సంబంధించిన అంశాలపై వ్యాసాలు రాయించారు. ఆ తర్వాత నెమ్మదిగా రక్షణ రంగానికి సంబంధించిన సున్నితమైన అంశాలపై వ్యాసాలు రాయించడం ప్రారంభించారు. తనను సంప్రదించిన వారు ఏజెంట్లని తెలుసుకోలేకపోయిన ఆమె.. 'ఇంటెలెక్చువల్ ట్రాప్'లో తెలియకుండానే చిక్కుకుపోయి సున్నితమైన సమాచారాన్ని పంచుకున్నట్టు విచారణాధికారులు అనుమానిస్తున్నారు.

### ఆల్టిమెట్రిక్ 'హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్

## సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ప్రారంభం

**వారం రోజుల్లోనే ఏఐ వర్క్‌ఫ్లో అందించే 'ఫార్మాఓఎస్' ఆవిష్కరణ**



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 18 :** ప్రముఖ కృత్రిమ మేధ (ఏఐ) ఇంజనీరింగ్ సంస్థ ఆల్టిమెట్రిక్ హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ఏఐ ఆధారిత ఆవిష్కరణలు వేగవంతం చేసేందుకు గచ్చిబౌలిలోని తన ప్రాంగణంలో 'హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ప్రారంభించింది. ఈ కేంద్రం ద్వారా తన మొట్టమొదటి 'ఫార్మాఓఎస్' అనే ఏజెంటిక్ ఏఐ ప్లాట్‌ఫామ్‌ను విడుదల చేసింది. ఆల్టిమెట్రిక్ ఏఎల్టీఐ ఏఐఓఎస్ ఫ్రేమ్‌వర్క్‌పై రూపొందించిన ఈ 'ఏజెంటిక్ ఏఐ ప్లాట్‌ఫామ్'తో పాటు పరిశ్రమలోని క్లయింట్‌లతో కలిసి భవిష్యత్తులో మరిన్ని సేవలను అభివృద్ధి చేయనుంది. ఫార్మాఓఎస్ సహాయంతో క్లయింట్‌లు ఒక నిర్దిష్ట ఆలోచన నుంచి ధ్రువీకరించబడిన, నియంత్రిత ఏఐ ఏజెంటిక్ వర్క్‌ఫ్లో స్థాయికి కేవలం ఒకే వారంలో చేరుకోవచ్చని, తద్వారా సంస్థలు ప్రాథమిక ఆలోచనను వేగంగా ఉపయోగపడే విధంగా మార్చుకోవచ్చని కేంద్రం తెలిపింది. రెగ్యులేటరీ నిబంధనలకు అనుగుణంగా ఉంటూ ప్రతి ఫలితాన్ని నమ్మకమైన మూలాలతో సరి చూస్తూ, తీసుకునే నిర్ణయాలకు మానవ జవాబుదారీతనాన్ని నిర్ధారించే విధంగా కృత్రిమ మేధ ఏజెంట్లను రూపొందించేందుకు ఏఐ ఇంజనీర్లు, లైఫ్ సైన్సెస్ నిపుణులను ఇది ఒకే వేదికపైకి తీసుకువస్తుంది. హైటెక్ సిటీ సమీపంలోని గచ్చిబౌలి, ఫీనిక్స్ ఈక్వినాక్స్‌లో 300 మందికి పైగా ఉద్యోగులతో ఉన్న ఆల్టిమెట్రిక్ 22,000 చదరపు అడుగుల కార్యాలయంలో ఈ కేంద్రం ఏర్పాటైంది. ఔషధాల ఆవిష్కరణ, క్లినికల్ డెవలప్‌మెంట్, వాణిజ్య కార్యకలాపాలు, తయారీ రంగం, రోగుల అనుసంధానం, ఆరోగ్య సంరక్షణ విభాగాలలో ఈ కేంద్రం సేవలు అందించనుంది. ఈ సందర్భంగా ఆల్టిమెట్రిక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజ్ సుందరేశన్ మాట్లాడుతూ సంస్థలు అర్థవంతమైన ఫలితాలను అందించే కృత్రిమ మేధను కోరుకుంటున్నాయన్నారు. హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ రంగాలలో పరిశ్రమల నేపథ్యం, రెగ్యులేటరీ నిబంధనలు, విశ్వసనీయ డేటా ఆధారంగా పరిష్కారాలు రూపొందించడమేనన్నారు. మా హెల్త్‌కేర్ & లైఫ్ సైన్సెస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి వస్తున్న మొట్టమొదటి ఉత్పత్తి 'ఫార్మాఓఎస్' అన్నారు. కీలకమైన పని విధానాలలో నియంత్రిత ఏఐ ఏజెంట్లను నిర్మించడానికి, విస్తరించడానికి గ్లోబల్ కస్టమర్లకు సహాయపడేలా దీనిని రూపొందించామని తెలిపారు. హైదరాబాద్‌లోని అపారమైన ఫార్మా నైపుణ్యం, సాంకేతిక ప్రతిభ ఈ కేంద్రానికి సరైన వేదికగా నిలవనుందన్నారు. ఆచరణాత్మక, పరిశ్రమ నిర్దిష్ట ఆవిష్కరణలను అందించడానికి అవసరమైన సామర్థ్యాలను ఇది ఏకతాటిపైకి తెస్తుందన్నారు. ఆల్టిమెట్రిక్ హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ విభాగాధిపతి రామ్‌జీ వాసుదేవన్ మాట్లాడుతూ హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ విభాగాలలో సంస్థలు రోగుల భద్రత లేదా నిబంధనల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా వేగంగా ముందుకు సాగాలన్నారు. డానరిక్స్ సహ-వ్యవస్థాపకుడు, గ్లోబల్ హెల్త్‌కేర్ ఫార్మా లీడర్ డాక్టర్ వివేక్ ఝా మాట్లాడుతూ ఫార్మా రంగంలో ఆధారాలపై విశ్వాసాన్ని, నిర్ణయాలలో జవాబుదారీ తనాన్ని నిలుపుకుంటూనే మన బృందాలు మరింత వేగంగా పని చేసేలా చేయడంలోనే ఏఐ నిజమైన విలువ దాగి ఉందన్నారు. రోగుల సంరక్షణను, ఫలితాలను మెరుగుపరచడమనే హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ రంగాల విస్తృత ప్రయోజనానికి ఉపయోగపడేలా సాంకేతికతపై నమ్మకాన్ని పెంపొందిస్తుందని తెలిపారు.

### దశదిన ఖర్మకు కాంగ్రెస్

## మండల అధ్యక్షుడు సమ్మిగౌడ్ ఆర్థిక సహాయం

- నాన్న మరణించిన కొన్ని సంవత్సరాలకు అమ్మ మృతి.. కన్నీటి సంద్రంలో ఇద్దరు కుమార్తెలు
- ఇంటి పరిస్థితి చూసి తక్షణ సాయం.. ఇంటిపై తాటిపత్రి కప్పించి, క్వింటా బియ్యం, ఆర్థిక సాయం అందజేసిన మండల అధ్యక్షులు
- బలహీన వర్గాలకు మండల కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది - మండల అధ్యక్షులు సమ్మిగౌడ్
- తల్లిదండ్రులను కోల్పోయి.. అనాథలుగా మారిన కుమార్తెలు



**వెలుతురు కేసముద్రం వెంకటగిరి, అక్టోబర్ 18:** కేసముద్రం మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన జనగాం కవిత భర్త యాకయ్య మరణించిన కొద్ది సంవత్సరాలకే కవిత కూడా అనారోగ్య కారణాలతో అక్టోబర్ 17న మృతిచెందారు. వరుసగా తల్లిదండ్రులను కోల్పోవడంతో వారి కుమార్తెలు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఆ కుటుంబం తీవ్ర పేదరికంలో ఉందని, పిల్లలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చేసే ఇద్దరు ఆడపిల్లలు చిన్నవాళ్లు అవ్వడం తో కన్నతల్లి దశదిన ఖర్మ కూడా చేసే పరిస్థితి లేదు అని గ్రామ మాజీ సర్పంచ్ యాకన్న యాదవ్, గ్రామ పార్టీ అధ్యక్షులు మద్రి వెంకట్రావు మండల పార్టీ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ గారి దృష్టికి తీసుకెళ్లగా ..ఇద్దరు ఆడపిల్లల తల్లి మరణవార్త విని వారి ఇంటికి వెళ్లి కుటుంబ పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. కన్నవారిని కోల్పోయిన పిల్లల దీనస్థితి, నివాసానికి సరైన సౌకర్యాలు లేకపోవడం ఆయనను కలచివేసింది..ఆ కుటుంబం నివసిస్తున్న ఇంటి పరిస్థితిని చూసిన సమ్మయ్య గౌడ్ తక్షణమే స్పందించారు. ఇంటిపై తాటిపత్రి కప్పించే ఏర్పాట్లు చేయించడంతో పాటు, అర క్వింటా బియ్యం, ఆర్థిక సాయం అందించారు. కష్టకాలంలో ఆ కుటుంబానికి అండగా నిలిచి, పిల్లలు ఒంటరివారమనే భావనకు లోనుకాకుండా ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బాలికతో మాట్లాడిన సమ్మయ్యగౌడ్..తనకు సాధ్యమైన సహాయం అందిస్తూ తల్లిదండ్రులను కోల్పోయిన ఆ ఆడబిడ్డలకు అండగా ఉంటానని,పెద్ద కూతురు పెళ్లి అవ్వగా,చిన్న బిడ్డ పెళ్లికి కూడా భవిష్యత్ లో సహాయం చేస్తానని భరోసా కల్పించారు. "కష్టాలు వచ్చాయని చదువును మధ్యలో ఆపవద్దు.. నువ్వు చదువుకోవాలి.. నీ భవిష్యత్తుకు నేను అండగా ఉంటాను" అంటూ బాలికలో ధైర్యాన్ని నింపారు..ఆపదలో ఉన్న కుటుంబానికి సాయం అందించడమే కాకుండా, చదువు మానేసిన బాలిక భవిష్యత్తుపై బాధ్యతతో స్పందించిన సమ్మయ్య గౌడ్ తీరును స్థానికులు అభినందించారు. కన్నవారిని కోల్పోయిన ఆ ఇద్దరు కుమార్తెల జీవితాల్లో ఈ సహాయం దశదిన ఖర్మ కార్యక్రమానికి చాలా సహాయం అవుతుందని, పిలిచిన వెంటనే వచ్చి సహాయం చేసిన మండల అధ్యక్షులు సమ్మిగౌడ్ గ్రామస్థులు అభినందించారు..ఈ కార్యక్రమంలో వెంకటగిరి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మద్రి వెంకట్రావు, మాజీ సర్పంచ్ సుజాత యాకన్న, మాజీ ప్రజాప్రతినిధి మారం మోహన్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు పోల్సాని విక్రమ్, ఇంటికన్నె గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజులపాటి మల్లయ్య, ఇంటికన్నె యూత్ అధ్యక్షుడు వర్ధంతి రంజిత్, కాంగ్రెస్ పార్టీ యువకులు జగదీష్, బానోతు అమిలాల్, అంబాల శరత్, జనగాం సాయికుమార్, పందుల రాజు, మల్లారి రాజు, అశోక్, సీనియర్ నాయకులు రాంపల్లి వెంకన్న, నల్లవాసప్పలయ్య, మిట్టకడుపుల యాకయ్య, కత్రి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన

## సెంట్రల్ స్కూల్ విద్యార్థిని

- అండర్-14 బాలికల 600 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం
- బి. సాత్వికకు ప్రశంసల వెల్లువ



**సూర్యాపేట, వెలుతురు అక్టోబర్ 18 :** పంజాబ్ రాష్ట్రం పాటియాలాలోని సుశీలాదేవి పబ్లిక్ స్కూల్ లో అక్టోబర్ 15 నుండి 20 వరకు జరుగుతున్న జాతీయ సి.బి.ఎస్.ఈ. అథ్లెటిక్స్ మీట్ 2026లో చివ్వెంల మండలం ఎం.ఎస్.ఆర్. సెంట్రల్ స్కూల్ లో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని కుమారి బి.సాత్విక అండర్-14 బాలికల 600 మీటర్ల పరుగు పందెంలో 1.42 సెకన్లలో మొదటి స్థానం సాధించి గోల్డ్ మెడల్ సాధించింది. జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని కుమారి బి. సాత్వికను మరియు ఫిజికల్ డైరెక్టర్ తూము హనుమంతరావు ని ఎం.ఎస్.ఆర్. సెంట్రల్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీరాజం, కరస్పాండెంట్ శ్రీనివాస్, చైర్మన్ కొల్లు మధుసూధనరావు మరియు ఉపాధ్యాయ బృందం తదితరులు అభినందించారు.

## కేసీఆర్ ప్రతిష్ఠ దెబ్బతీసేందుకే తప్పుడు ప్రచారం

**-బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్**



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 18:** కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులపై వెలుగు పత్రిక ప్రచురిస్తున్న కథనాలు అవాస్తవాలతో కూడుకున్నవని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ డిమాండ్ చేశారు. కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు కేవలం కేసీఆర్ ఫామ్‌హౌస్ కోసమే నిర్మించారంటూ కథనాలు ప్రచురించడం దురుద్దేశపూరితమని విమర్శించారు. పరిశోధనాత్మక జర్నలిజం పేరుతో కట్టుకథలు అల్లి కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. 15 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన కొండపోచమ్మ సాగర్ ద్వారా వందలాది గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగాయని, లక్షల ఎకరాలకు పరోక్షంగా, లక్ష ఎకరాలకు పైగా ప్రత్యక్షంగా సాగునీరు అందుతోందని దేవీప్రసాద్ పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సాగునీటి అవసరాల కోసం నిర్మించిన కాలువలను కేసీఆర్ పొలాల కోసమే ఏర్పాటు చేసినట్లు చిత్రీకరించడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. వేల ఎకరాల భూమిని కబ్జా చేశారన్న ఆరోపణలు తప్పని తేలిన నేపథ్యంలోనూ బీఆర్ఎస్ అధినేతపై దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. హామీల అమలుపై ప్రజల్లో పెరుగుతున్న ఆగ్రహాన్ని పక్కదారి పట్టించేందుకే ప్రాజెక్టులు, బీఆర్ఎస్ అధినేతపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. ఇప్పటికైనా వెలుగు పత్రిక తన కథనాలను ఉపసంహరించుకోవాలని దేవీప్రసాద్ డిమాండ్ చేశారు.

## బాలీవుడ్ హీరో టైగర్ ష్రాఫ్ పై కాల్పులు

**ముంబైలో తీవ్ర కలకలం**



**ముంబై, వెలుతురు, అక్టోబర్ 18 :** బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ ప్రయాణిస్తున్న కారుపై కాల్పుల ఘటన ముంబైలో తీవ్ర సంచలనం సృష్టించింది. ఆదివారం సాయంత్రం జుహు ప్రాంతంలో జరిగిన ఈ దాడిలో ఆయన తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఈ ఘటనలో టైగర్ ష్రాఫ్‌కు ఎలాంటి గాయాలు కాలేదని, అయితే ఆయన డ్రైవర్ గాయపడ్డారని ముంబై పోలీసులు ధ్రువీకరించారు. వివరాల్లోకి వెళితే, ఆదివారం సాయంత్రం ఫుట్‌బాల్ ఆడి తన బీఎండబ్ల్యూ కారులో ఇంటికి తిరిగి వస్తుండగా ఈ దాడి జరిగింది. జుహు పోలీస్ స్టేషన్ పరిధిలోని పుష్పా పార్క్ సమీపంలోకి రాగానే, మోటార్‌సైకిల్‌పై వచ్చిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ఆయన కారును లక్ష్యంగా చేసుకుని మూడు నుంచి ఐదు రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ ఘటనలో టైగర్ ష్రాఫ్ సురక్షితంగా ఉండగా, ఆయన కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం నానావతి ఆసుపత్రికి తరలించారు. ఈ దాడిలో సమీపంలో ఉన్న ఒక ఆటో డ్రైవర్‌కు కూడా గాయాలైనట్లు సమాచారం. ఘటన గురించి తెలియగానే ముంబై పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. డీసీపీ మోహిత్ గార్గ్ సహా ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షించారు. టైగర్ ష్రాఫ్ సురక్షితంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. పోలీసులు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని, నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. దుండగులను పట్టుకోవడానికి దాదాపు 12 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.




తెలంగాణలో బియ్యం ధరలు సామాన్యుడికి భారంగా మారుతున్నాయి. పేద, మధ్యతరగతి కుటుంబాల నెలవారీ ఖర్చుల్లో అత్యంత కీలకమైన బియ్యం ధరలు ఇటీవల గణనీయంగా పెరగడంతో ఇంటి బడ్జెట్ తలకిందులవుతోంది. ముఖ్యంగా సన్నబియ్యం ధరలు చుక్కలనంటుతున్నాయి. అక్టోబర్ 9న వెలువడిన మార్కెట్ కథనాల ప్రకారం గతంలో కిలో రూ.70 పలికిన సన్నబియ్యం రూ.80 నుంచి రూ.82కు చేరింది. రూ.1,800 వరకు లభించిన 25 కిలోల బస్తా రూ.2,150కు పెరిగింది. అంటే ఒక్క బస్తాపైనే రూ.350 అదనపు భారం పడుతోంది. మరోవైపు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ ధరల పర్యవేక్షణ గణాంకాల ప్రకారం అక్టోబర్ 10న తెలంగాణలో సాధారణ బియ్యం సగటు చిల్లర ధర కిలో రూ.70గా నమోదైంది. రకం, నాణ్యత, ప్రాంతాన్ని బట్టి ధరల్లో వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది.

- హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 18

# బియ్యం.. భయ్యం..!!

## సామాన్యుడి నెత్తిన ధరల భారం

**కిలో రూ.80 దాటిన సన్నబియ్యం**

**నెల వ్యవధిలో బస్తాపై రూ.350 పెరుగుదల**

**రైతు నుంచి వినియోగదారుడి వరకు మధ్యవర్తులదే పైచేయి?**

**నిల్వలు, ధరల వ్యత్యాసంపై నిఘా పెంచాల్సిన అవసరం**

### నెలకు రూ.700 అదనపు భారం!

బియ్యం ధరల పెరుగుదల కుటుంబాల కొనుగోలు శక్తిని దెబ్బతీస్తోంది. నెలకు 50 కిలోల సన్నబియ్యం వినియోగించే కుటుంబాన్ని ఉదాహరణగా తీసుకుంటే, కిలో ధర రూ.70 నుంచి రూ.82కు పెరగడం వల్ల నెలకు రూ.600 అదనంగా ఖర్చవుతుంది. బస్తా ధరల ఆధారంగా లెక్కిస్తే రెండు బస్తాలపై రూ.700 అదనపు భారం పడుతోంది. దీనికి పప్పులు, నూనెలు, ఇతర నిత్యావసరాల ధరల పెరుగుదల తోడవడంతో సామాన్యుడి పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది.

### ధరల పెరుగుదల వెనుక ఎవరున్నారు?

రైతు పండించిన ధాన్యం వినియోగదారుడి ఇంటికి బియ్యంగా చేరే క్రమంలో అనేక దశలు ఉంటాయి. ధాన్యం కొనుగోలు, మిల్లింగ్, నిల్వ, టోకు విక్రయం, రవాణా, చిల్లర వ్యాపారం వంటి ప్రతి దశలో ఖర్చులు, లాభాలు కలుస్తాయి. అయితే వాస్తవ ఖర్చులకు మించి ధరలు పెరుగుతున్నాయా? కృత్రిమ కొరత సృష్టించి కొందరు వ్యాపారులు అదనపు లాభాలు పొందుతున్నారా? అనే అంశాలపై సమగ్ర పరిశీలన అవసరమవుతోంది. ముఖ్యంగా రైతుకు లభించే ధాన్యం ధరకు, వినియోగదారుడు చెల్లించే బియ్యం ధరకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రభుత్వం నిశితంగా పరిశీలించాల్సి ఉంది. వ్యాపారులు, మధ్యవర్తులు, మిల్లర్ల వద్ద ఉన్న నిల్వలు, కొనుగోలు ధరలు, విక్రయ ధరలను సరిపోలిస్తే అసలు పరిస్థితి వెలుగులోకి వచ్చే అవకాశముంది.

### మిల్లర్ల బకాయిలపై ప్రభుత్వ కన్నెర్ర

బియ్యం వ్యాపార వ్యవస్థలో నెలకొన్న సమస్యల తీవ్రతను రాష్ట్ర ప్రభుత్వ అధికారిక సమాచారమే వెల్లడిస్తోంది. ఆగస్టు 12న పౌరసరఫరాల శాఖపై నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిల్లర్ల బకాయిల వ్యవహారంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోయాయని పేర్కొంటూ, మిల్లర్ల నుంచి రావాల్సిన ధాన్యం విలువను పూర్తిస్థాయిలో వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా ఎగవేతలకు పాల్పడే మిల్లర్లపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పదేపదే బకాయిలు ఎగవేసే మిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని మహిళా స్వయం సహాయక సంఘాలకు మర ఆడించేందుకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.

### ప్రభుత్వ లెక్కల్లోనే ధరల భారం

కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ రాష్ట్రాల నుంచి సేకరిస్తున్న నిత్యావసర వస్తువుల ధరల గణాంకాలు తెలంగాణలో బియ్యం ధరల పరిస్థితిని వెల్లడిస్తున్నాయి.

**అక్టోబర్ 2026లో బియ్యం ధరల పరిస్థితి**

| | |
|---|---|
| సాధారణ బియ్యం సగటు చిల్లర ధర (అక్టోబర్ 10) | రూ.70/కిలో |
| సన్నబియ్యం మార్కెట్ ధర (అక్టోబర్ 9) | రూ.80-82/కిలో |
| 25 కిలోల బస్తా గత ధర | రూ.1,800 |
| 25 కిలోల బస్తా పెరిగిన ధర | రూ.2,150 |
| బస్తాపై అదనపు భారం | రూ.350 |

### నిల్వలపై నిఘా ఎంత?

ధాన్యం సమృద్ధిగా ఉన్నప్పటికీ వినియోగదారులకు అందుబాటు ధరల్లో బియ్యం లభించకపోతే సరఫరా వ్యవస్థ పనితీరును ప్రశ్నించాల్సిందే. మిల్లర్లు, టోకు వ్యాపారులు, గోదాముల నిర్వాహకుల వద్ద ఉన్న నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించడం ద్వారా కృత్రిమ కొరతకు అవకాశం లేకుండా చూడవచ్చు. నిత్యావసర వస్తువుల అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్ విక్రయాలు, సరఫరా మళ్లింపులను నిరోధించేందుకు నిత్యావసర వస్తువుల చట్టం-1955 కింద చర్యలు తీసుకునే అధికారం పౌరసరఫరాల శాఖకు ఉంది. జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశాలు నిర్వహించడం, అవసరమైతే బహిరంగ మార్కెట్‌లో జోక్యం చేసుకోవడం కూడా శాఖ బాధ్యతల్లో భాగమే.

### ధరల నియంత్రణకు చర్యలేవీ?

పొరుగు రాష్ట్రం తమిళనాడులోనూ బియ్యం ధరల పెరుగుదల నేపథ్యంలో అక్టోబర్ 16న అక్కడి ప్రభుత్వం మార్కెట్ జోక్యానికి నిర్ణయించింది. తొలి విడతలో 25 వేల మెట్రిక్ టన్నుల నాణ్యమైన బియ్యాన్ని సహకార దుకాణాల ద్వారా కిలో రూ.30కి అందించే కార్యక్రమాన్ని ప్రకటించింది. తెలంగాణలోనూ బహిరంగ మార్కెట్ ధరలను అదుపు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలనే అవసరం కనిపిస్తోంది. మిల్లుల వారీగా ధాన్యం నిల్వలు, బియ్యం ఉత్పత్తి, టోకు విక్రయాల వివరాలను పరిశీలించడంతోపాటు రైతు నుంచి చిల్లర వినియోగదారుడి వరకు ధరల వ్యత్యాసాన్ని వెల్లడించాలి. అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత, అధిక ధరలకు విక్రయాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అవసరమైతే ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి సామాన్యులకు ఉపశమనం కల్పించాలి. ధాన్యం పండించే రైతుకు న్యాయం జరగాలి. బియ్యం కొనుగోలు చేసే సామాన్యుడికీ భారం తగ్గాలి. ఈ రెండింటి మధ్య వ్యాపార వ్యవస్థలో జరిగే ప్రతి లావాదేవీ పారదర్శకంగా ఉన్నప్పుడే ధరల దోపిడీకి అడ్డుకట్ట పడుతుంది.

## క్యాన్సర్ మందులపై కేంద్రం కీలక నిర్ణయం

**ధరల నియంత్రణలోకి వచ్చే మందుల జాబితా విస్తరణ**

**70 శాతం వరకు తగ్గనున్న ధరలు**

**నవంబర్ 9 నుంచి అమల్లోకి**




**న్యూఢిల్లీ, వెలుతురు, అక్టోబర్ 18:**

క్యాన్సర్ చికిత్సను మరింత సరసమైన ధరలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ధరల నియంత్రణ పరిధిలోకి వచ్చే క్యాన్సర్ నిరోధక ఔషధాల జాబితాను విస్తరించింది. ఇందులో భాగంగా షెడ్యూల్‌లో లేని 137 రకాల క్యాన్సర్ ఔషధాల ధరలను 70 శాతం వరకు తగ్గించనున్నారు. కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. సవరించిన ధరలు నవంబర్ 9 నుంచి అమల్లోకి రానున్నాయి. క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే అత్యవసర ఔషధాలను మరింత అందుబాటు ధరల్లోకి తీసుకురావడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. రొమ్ము, ప్రోస్టేట్, పెద్దప్రేగు, అండాశయం, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లతో పాటు మొత్తం 20 రకాల క్యాన్సర్ల చికిత్సలో ఉపయోగించే మందులు ఈ జాబితాలో ఉన్నాయి. ఇమ్యునోథెరపీ ఔషధాలు కూడా ఇందులో భాగంగా ఉన్నాయి. బ్రాండెడ్, జెనరిక్ మందులతో పాటు దేశీయంగా తయారయ్యే, దిగుమతి చేసుకునే ఔషధాలకు ఈ నియంత్రణ వర్తించనుంది.

### ఏటా రూ.2,500 కోట్ల వరకు ఆదా

కొత్త ధరల నియంత్రణతో క్యాన్సర్ రోగులకు ఏటా సుమారు రూ.2,500 కోట్ల వరకు ఆదా అయ్యే అవకాశం ఉందని గతంలో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఔషధాల గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ)పై వాణిజ్య మార్జిన్‌ను 30 శాతానికి పరిమితం చేయనున్నారు. దీనివల్ల మందుల విక్రయాల్లో అధిక లాభాల మార్జిన్లకు అడ్డుకట్ట పడటంతో పాటు రోగులపై పడే ఆర్థిక భారం తగ్గుతుందని భావిస్తున్నారు.





## భక్తులపైకి దూసుకెళ్లిన మృత్యుశకటం!

- **గ్వాలియర్‌లో ఘోర ప్రమాదం.. 15 మంది మృతి**
- **33 మందికి గాయాలు.. పలువురి పరిస్థితి విషమం**
- **పోలీసుల అడ్డంకులు ఛేదించుకుని భక్తులపైకి దూసుకెళ్లిన ట్రక్కు**
- **మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారం ప్రకటించిన మధ్యప్రదేశ్ ప్రభుత్వం**

**గ్వాలియర్, వెలుతురు అక్టోబర్ 18:**

మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గ్వాలియర్‌లోని శీతలామాత ఆలయానికి వెళ్తున్న భక్తులపైకి ధాన్యం లోడుతో ఉన్న ట్రక్కు అదుపుతప్పి దూసుకెళ్లడంతో ఆదివారం తెల్లవారుజామున తీవ్ర విషాదం నెలకొంది. తొలుత 12 మంది మరణించినట్లు అధికారులు వెల్లడించగా, అనంతరం మృతుల సంఖ్య 15కు పెరిగినట్లు తాజా కథనాలు పేర్కొన్నాయి. మరో 33 మంది గాయపడగా, వారిలో ఐదారుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతుల్లో గ్వాలియర్‌తోపాటు శివపురి, షియోపూర్ ప్రాంతాలకు చెందిన భక్తులు ఉన్నారు.

నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో శీతలామాత ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున సుమారు 1.30గంటల సమయంలో చినోర్ వైపు నుంచి ధాన్యం లోడుతో వస్తున్న ట్రక్కు నిటారుగా ఉన్న రహదారిపై అదుపుతప్పింది. భారీ వాహనాల రాకపోకలను నిషేధిస్తూ పోలీసులు ఏర్పాటు చేసిన అడ్డంకులను ఛేదించుకుని వేగంగా దిగువకు దూసుకొచ్చింది. రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న భక్తులను ఢీకొట్టడంతో పాటు ఆలయ ప్రవేశ ద్వారం, ప్రహరీ గోడను బలంగా తాకింది. ట్రక్కు కింద పలువురు భక్తులు చిక్కుకుపోగా, గోడ శిథిలాలు మరికొందరిపై పడ్డాయి. ఈ ఘటనలో విధుల్లో ఉన్న ఇద్దరు పోలీసు సిబ్బంది కూడా గాయపడ్డారు.

### మృతుల కుటుంబాలకు పరిహారం

ప్రమాదంపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.4 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2 లక్షలు, ఇతర క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు. మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున అందజేయనున్నట్లు ప్రకటించారు.

## తాగునీరు వృథా చేస్తే ఊరుకోం

- **హైదరాబాద్ జలమండలి స్పష్టం**
- **జూబ్లీహిల్స్ పబ్‌కు రూ.20 వేల జరిమానా**
- **నీటిని దుర్వినియోగం చేసే వారిపై ఉక్కుపాదం**

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 18**




తాగునీటిని దుర్వినియోగం చేస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు తప్పవని హైదరాబాద్ జలమండలి స్పష్టం చేసింది. నీటి వృథాపై అందిన ఫిర్యాదుతో జూబ్లీహిల్స్‌లోని ఫోర్ ఫాదర్స్ పబ్‌పై అధికారులు చర్యలు తీసుకున్నారు. నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి రూ.20 వేల జరిమానా విధించడంతో పాటు తాగునీటి కనెక్షన్‌ను తొలగించారు. కమర్షియల్ వాటర్ ట్యాంకర్ల ద్వారా అందించే నీటి సరఫరాను కూడా నిలిపివేశారు. జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలోని రోడ్ నంబర్ 45, ప్లాట్ నంబర్ 872లో ఉన్న ఫోర్ ఫాదర్స్ పబ్‌లో నీటి దుర్వినియోగం జరుగుతున్నట్లు జలమండలికి ఫిర్యాదు అందింది. దీంతో అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. నీటి దుర్వినియోగానికి పాల్పడినట్లు గుర్తించడంతో పబ్ యాజమాన్యంపై చర్యలు తీసుకున్నారు. జరిమానాతో పాటు తాగునీటి కనెక్షన్‌ను తొలగించి, కమర్షియల్ వాటర్ ట్యాంకర్ల సరఫరాను నిలిపివేశారు.

వేసవిలో తాగునీటి అవసరాలు పెరిగే అవకాశం ఉండటంతో ప్రతి నీటి చుక్కనూ పొదుపుగా వినియోగించాలని జలమండలి ప్రజలకు సూచించింది. హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లు, ఇతర వాణిజ్య సంస్థలు తాగునీటిని వృథా చేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని కోరింది. నీటి దుర్వినియోగాన్ని ఉపేక్షించబోమని, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు కనెక్షన్ల తొలగింపు వంటి చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. నగరంలో ఎక్కడైనా తాగునీటి వృథా లేదా దుర్వినియోగం కనిపిస్తే ప్రజలు జలమండలికి వాట్సాప్: 99499 30003, కస్టమర్ కేర్: 155313 నంబర్ల ద్వారా సమాచారం అందించాలని అధికారులు కోరారు.

ఫిర్యాదుతో పాటు ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, వ్యక్తులు లేదా సంస్థల వివరాలు, ప్రాంతం, పూర్తి చిరునామాను పంపించాలని సూచించారు. అందిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, ఉల్లంఘనలు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని జలమండలి హామీ ఇచ్చింది.

## హైదరాబాద్ స్థిరాస్తి జోరుకు బ్రేక్!

- **సెప్టెంబర్‌లో 15 శాతం తగ్గిన గృహాల రిజిస్ట్రేషన్లు**
- **బడ్జెట్, మధ్యశ్రేణి ఇళ్ల కొనుగోళ్లలో క్షీణత**
- **లావాదేవీల విలువకు ఖరీదైన ఇళ్లే ఆసరా**

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 18:** తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో స్థిరాస్తి మార్కెట్ జోరుకు సెప్టెంబర్‌లో బ్రేకులు పడ్డాయి. గతేడాది ఇదే నెలతో పోలిస్తే గృహాల రిజిస్ట్రేషన్లు గణనీయంగా తగ్గాయి. ముఖ్యంగా బడ్జెట్, మధ్య శ్రేణి ఇళ్ల కొనుగోళ్లు మందగించాయి. అయితే, కోటి రూపాయలకు పైబడిన ఖరీదైన ఇళ్ల లావాదేవీలు మొత్తం మార్కెట్ విలువకు కొంత ఊరటనిచ్చాయి. ప్రముఖ స్థిరాస్తి సలహా సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా తెలంగాణ ప్రభుత్వ రిజిస్ట్రేషన్ల శాఖ గణాంకాలను విశ్లేషించి ఈ వివరాలను వెల్లడించింది.

### 5,620 రిజిస్ట్రేషన్లకే పరిమితం

నైట్ ఫ్రాంక్ నివేదిక ప్రకారం.. 2026 సెప్టెంబర్‌లో




హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో 5,620 నివాస గృహాల రిజిస్ట్రేషన్లు జరిగాయి. గతేడాది ఇదే నెలలో నమోదైన 6,612 రిజిస్ట్రేషన్లతో పోలిస్తే 15 శాతం తగ్గుదల నమోదైంది. లావాదేవీల విలువ సైతం 7శాతం క్షీణించి రూ.4,804 కోట్ల నుంచి రూ.4,487 కోటలకు పడిపోయింది. ఆగస్టు 2026తో పోల్చినా రిజిస్ట్రేషన్ల సంఖ్యలో 5 శాతం తగ్గుదల కనిపించింది.

### బడ్జెట్ ఇళ్లకు తగ్గిన ఆదరణ

రిజిస్ట్రేషన్ల క్షీణత ప్రధానంగా బడ్జెట్, మధ్యశ్రేణి గృహాల విభాగంలోనే ఎక్కువగా కనిపించింది. రూ. 50లక్షలలోపు విలువైన ఇళ్ల రిజిస్ట్రేషన్లు ఏకంగా 20 శాతం పడిపోగా, రూ.50 లక్షల నుంచి రూ.కోటి మధ్య ఉన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు 6 శాతం తగ్గాయి. మరోవైపు కోటి రూపాయలకు పైబడిన ఇళ్ల రిజిస్ట్రేషన్లు 12శాతం తగ్గినప్పటికీ,వాటి లావాదేవీల విలువలో క్షీణత కేవలం 2 శాతానికే పరిమితమైంది. మొత్తం లావాదేవీల విలువలో ఈవిభాగం వాటా గతేడాది 54శాతం ఉండగా,ఈసారి 56శాతానికి పెరిగింది.

### తొమ్మిది నెలల్లో రూ.39,910 కోట్ల లావాదేవీలు

సెప్టెంబర్‌లో రిజిస్ట్రేషన్లు మందగించినప్పటికీ, ఏడాది తొలి తొమ్మిది నెలల గణాంకాలు మార్కెట్ నిలకడను సూచిస్తున్నాయి. జనవరి నుంచి సెప్టెంబర్ వరకు మొత్తం 55,715 గృహాలు రిజిస్టర్ కాగా, లావాదేవీల విలువ గతేడాది కంటే 4 శాతం పెరిగి రూ.39,910 కోట్లకు చేరింది. ఈ ఏడాది ఆరంభంలో ప్రభుత్వం మార్గదర్శక విలువలను సవరించిన తర్వాత నెలవారీ రిజిస్ట్రేషన్లలో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. నైట్ ఫ్రాంక్ ఇండియా ప్రతినిధి శిశిర్ బైజాల్ మాట్లాడుతూ.. మొత్తం రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గినప్పటికీ, అధిక ధర కలిగిన ఇళ్ల వాటా పెరగడంతో లావాదేవీల విలువ కొంత నిలకడగా ఉందన్నారు. ఖరీదైన గృహాలకు కొనుగోలుదారుల నుంచి డిమాండ్ కొనసాగుతోందని వివరించారు.కాగా,రిజిస్టర్ అయిన గృహాల్లో 1,000 నుంచి 2,000 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఇళ్లే 66 శాతం వాటాతో అగ్రస్థానంలో నిలిచాయి.

# ఆలయాల అభివృద్ధికి రూ.2,500 కోట్లు



- భద్రాచలం అభివృద్ధికి రూ.276 కోట్లు..
- బాసర ఆలయానికి రూ.354 కోట్లు
- ప్రజా సంక్షేమమే మా అజెండా..
- ప్రతి కుటుంబం బాగుండటమే లక్ష్యం
- రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు..
- నాచారం ఆలయానికి రూ.44 కోట్లతో రహదారి
- మరో బీటీ రోడ్డు మంజూరుకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క హామీ

**వైరా/ఖమ్మం, వెలుతురు, అక్టోబర్ 18 :**

రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గం ఏన్కూరు మండలం నాచారంలోని అద్భుత వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఆయన, ఆలయానికి వెళ్లే రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయానికి భవిష్యత్తులో లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రూ.44 కోట్లతో రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే రామదాసు నాయక్ పట్టుదలతో ఈ రహదారికి నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రహదారి నిర్మాణంతో భక్తులకు సౌకర్యం కలగడమే కాకుండా స్థానికంగా వ్యాపారాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి సుమారు రూ.2,500 కోట్లతో పనులు చేపడుతున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతాలు, అక్కడి ఆలయాల అభివృద్ధికి రూ.2,000 కోట్లను ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రూ.276 కోట్లు, బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.354 కోట్లు కేటాయించినట్లు వివరించారు.

### సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా

ప్రజల కుటుంబ అవసరాలను తీర్చడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని ఉప ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో 1.06 కోట్ల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం, 71 లక్షల మంది రైతులకు రైతు భరోసా, 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు వడ్డీలేని రుణాలు, అర్హులైన వారికి సామాజిక భద్రత పింఛన్లు, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున సాయం అందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

### విద్యార్థుల భవిష్యత్తుకు ప్రత్యేక చర్యలు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహార పథకం అమలు చేస్తున్నట్లు భట్టి విక్రమార్క చెప్పారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు వెల్లడించారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామని, వైరా నియోజకవర్గానికి కూడా ఈ పాఠశాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంతానికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను కూడా కేటాయించామన్నారు. అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి, ప్రపంచంతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని పేర్కొన్నారు.

### రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు

రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి సుమారు రూ.90 వేల కోట్లతో పనులు చేపడుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు పైగా పెరిగినా నిరంతర సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత పదేళ్లలో రాష్ట్రంపై సుమారు రూ.8.20 లక్షల కోట్ల అప్పుల భారం పడిందని, ప్రస్తుతం అసలు, వడ్డీల చెల్లింపులకు ప్రతి నెలా సుమారు రూ.6,600 కోట్లు వెచ్చించాల్సి వస్తోందని పేర్కొన్నారు. అయినప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.

### నీటిని పొదుపుగా వినియోగించాలి

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని భట్టి విక్రమార్క హెచ్చరించారు. తాగునీటితోపాటు పశువులు, పక్షుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించాలని ప్రజలకు సూచించారు. భూగర్భ జలాల పరిస్థితిని గమనించి మోటార్లను వినియోగించాలని రైతులను కోరారు. నీటి పొదుపుపై గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణుల సూచనలతో ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించాలని పేర్కొన్నారు.

### మరో బీటీ రోడ్డు మంజూరుకు హామీ

వైరా నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటికే పలు రహదారులను మంజూరు చేశామని భట్టి విక్రమార్క తెలిపారు. నాచారం గ్రామం నుంచి జూలూరుపాడు మీదుగా తల్లాడ-భద్రాచలం ప్రధాన రహదారిని కలిపేలా గన్నవరం, నాచారం, భద్రతండా ప్రాంతాలకు ఉపయోగపడే మరో బీటీ రహదారిని మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడం, వారి జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ అధ్యక్షత వహించారు ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువాళ్ళ దుర్గాప్రసాద్,మాజీ ఎమ్మెల్సీ పోట్లనాగేశ్వరావు డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణలు పాల్గొన్నారు.



# బోర్డులపై స్పెషల్ ..! ఛార్జీలు డబుల్!!

**పండుగల వేళ ఆర్టీసీ ఛార్జీల బాదుడు**

**టికెట్ ధరలను రెట్టింపు చేసి ప్రజలపై భారం మోపుతున్నారు**

**ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు**

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 18 :**

బతుకమ్మ, దసరా పండుగల వేళ ఆర్టీసీ టికెట్ ఛార్జీలను పెంచి ప్రజలపై భారం మోపుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత హరీశ్‌రావు విమర్శించారు. పండుగలకు సొంతూళ్లకు వెళ్లే ప్రజలకు కానుకలు అందించాల్సింది పోయి, ప్రత్యేక బస్సుల పేరుతో టికెట్ ధరలను రెట్టింపు చేసి దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు సాధారణంగా రూ.230గా ఉన్న టికెట్ ధరను రూ.400కు పెంచారని, మహబూబ్‌నగర్ నుంచి ఎంజీబీఎస్‌కు గతంలో రూ.220గా ఉన్న ఛార్జీని ఇప్పుడు రూ.290కిపైగా వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు.

రెగ్యులర్ బస్సుల సంఖ్యను తగ్గించి, ప్రత్యేక బస్సుల పేరుతో ప్రయాణికుల జేబులకు చిల్లులు పెడుతున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. కొత్త బస్సులు పెంచకుండా, సాధారణంగా నడిచే బస్సులకే పండుగ ప్రత్యేక బస్సుల బోర్డులు తగిలించి అధిక ఛార్జీలు వసూలు చేయడం ప్రజాపీడనమేనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు మార్గాల్లో టికెట్ ధరలను పెంచడంతో పేద, మధ్యతరగతి ప్రజలు పండుగలకు సొంతూళ్లకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.




### ఉచిత ప్రయాణం పేరుతో మరోవైపు భారం

మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని చెబుతూ, పురుషుల నుంచి రెట్టింపు ఛార్జీలు వసూలు చేయడం ఏ రకమైన ప్రజాపాలన అని హరీశ్‌రావు ప్రశ్నించారు. భార్యకు ఉచిత టికెట్ ఇచ్చి, భర్తకు అధిక ఛార్జీ వసూలు చేస్తే ఆ కుటుంబానికి నిజంగా ప్రయోజనం కలిగినట్లా, లేక ఆ భారాన్ని అదే కుటుంబంపై మోపినట్లా అని నిలదీశారు. ఒకవైపు ఉచిత ప్రయాణం కల్పిస్తూ, మరోవైపు అధిక ఛార్జీలతో ప్రజలపై భారం వేయడం సరికాదన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ టికెట్ ఛార్జీలను ఇప్పటికే ఐదుసార్లు పెంచిందని, ఇప్పుడు పండుగల పేరుతో అదనపు భారం మోపుతోందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పండుగల సందర్భంగా పెంచిన ఛార్జీలను తగ్గించాలని, సాధారణ బస్సులను యథావిధిగా నడిపించాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పక్షాన కోరారు.

# శ్రీ మహాశక్తి ఆలయంలో అమ్మవార్లను దర్శించుకున్న మంత్రి పొన్నం

**కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్‌తో కలిసి పాల్గొన్న మంత్రి**



**కరీంనగర్, వెలుతురు, అక్టోబర్ 18 :**

శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి ఆలయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో కలిసి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ దుర్గాదేవి రూపంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ప్రజాపాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి అవరోధాలు లేకుండా విజయవంతంగా కొనసాగాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# జుక్కల్‌లో చిరుత కలకలం..

- గుండూర్ శివారులో సంచారం..
- వీడియోలు, ఫొటోలు వైరల్
- అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సూచన



**జుక్కల్, వెలుతురు అక్టోబర్ 18:**

కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలో చిరుతపులి సంచారం మరోసారి కలకలం రేపింది. గుండూర్ గ్రామ శివారులో మహారాష్ట్రలోని సోమూర్‌కు వెళ్లే మార్గంలో ఆదివారం రాత్రి వాహనదారులు, స్థానికులకు చిరుత కనిపించింది. చిరుత సంచరిస్తున్న దృశ్యాలను కొందరు వీడియోలు, ఫొటోలు తీయగా.. అవి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీంతో సమీప గ్రామాల రైతులు, ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

గుండూర్ గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో చిరుత కనిపించడంతో గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు చిరుత సంచరిస్తున్న ప్రాంతాలను పరిశీలించినట్లు గ్రామస్తులు తెలిపారు. గత పది నెలలుగా జుక్కల్ ప్రాంతంలోని బంగారుపల్లి, దోస్‌పల్లి, మైబాపూర్, గుండూర్, బస్వపూర్, పెద్ద ఎడ్గి, డోన్‌గాం తదితర గ్రామాల శివార్లలో చిరుత సంచరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. గతంలో మేకలు, గేదెలు, ఆవుదూడలు, కుక్కలపై దాడులు జరిగినట్లు పేర్కొంటున్నారు. చిరుత సంచారం నేపథ్యంలో రైతులు, గ్రామస్తులు పొలాలకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు. చిరుత కనిపించినా, దాని ఆనవాళ్లు గుర్తించినా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. మరోవైపు, చిరుత సంచారంతో తమకు, పశువులకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కరీంనగర్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

- ఎమ్మెల్యే గంగులతో కలిసి మార్క్‌ఫెడ్ గ్రౌండ్స్‌లో వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్
- తలపై బతుకమ్మను ఎత్తుకొని మహిళల్లో ఆనందోత్సాహాలు నింపిన మంత్రి
- తెలంగాణతో పాటు దేశం, ప్రపంచవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు.. కరువు నుంచి విముక్తి కలగాలని అమ్మవారిని ప్రార్థించాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్



**కరీంనగర్, వెలుతురు అక్టోబర్ 18:**

కరీంనగర్ పట్టణంలోని మార్క్‌ఫెడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ తలపై బతుకమ్మను ఎత్తుకొని మహిళలతో కలిసి వేడుకల్లో పాల్గొని వారిలో ఆనందోత్సాహాలు నింపారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని తీవ్ర కరువు పరిస్థితులు ఎదురవుతున్నాయని, ఈ పరిస్థితులు తెలంగాణకే పరిమితం కాకుండా దేశంతో పాటు ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. కరువు పరిస్థితుల నుంచి విముక్తి కలగాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని అమ్మవారిని ప్రార్థించాలని కోరారు. గతంలో మనకు అనేక ఇబ్బందులు ఎదురైనప్పుడు అమ్మవారి ఆశీస్సులతో కష్టాలను అధిగమించామని, ప్రజలందరికీ ఎలాంటి కష్టాలు రాకుండా అమ్మవారు అండగా నిలవాలని ప్రార్థిద్దామని అన్నారు.

పితృ అమావాస్య రోజున ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు నేడు సద్దుల బతుకమ్మతో ముగింపు దశకు చేరుకున్నాయని తెలిపారు. రంగురంగుల పూలను సేకరించి, పూలనే దేవతగా భావించి పూజించడం తెలంగాణ ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. మహిళలు ఆటపాటలతో, సాంప్రదాయబద్ధంగా బతుకమ్మ పండుగను జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ పర్యావరణానికి హాని కలగకుండా జరుపుకోవాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతాంగం సంతోషంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

మేమంతా మీ కళ్ల ముందు పెరిగిన వారమేనని, ప్రజల సమస్యల పరిష్కారం, కరీంనగర్ జిల్లా అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి పనిచేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజల సంక్షేమం, జిల్లా అభివృద్ధే లక్ష్యంగా సమిష్టిగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు.





# సచివాలయంలో మంత్రి వాకిటి ప్రత్యేక పూజలు

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 18:**

దసరా, సద్దుల బతుకమ్మ పండుగలను పురస్కరించుకుని మంత్రి వాకిటి శ్రీహరి సచివాలయంలోని తన చాంబర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగతో పాటు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రజల జీవితాల్లో ఆనందం, శాంతి, సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు బతుకమ్మ, దసరా పండుగలు ప్రతీకలుగా నిలుస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# సద్దుల బతుకమ్మ సంబరాల్లో.. పాల్గొన్న బండి సంజయ్ దంపతులు

**కరీంనగర్, వెలుతురు అక్టోబర్ 18:**

కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి మందిరంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మను చేతబూని పండుగ సంబరాల్లో భాగస్వాములయ్యారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకున్నారు. వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ వేడుకల్లో పాల్గొన్నారు. పండుగ ప్రాంగణం విద్యుత్ దీపాల అలంకరణలతో, పూల బతుకమ్మలతో సందడిగా మారింది. ప్రకృతిని ఆరాధిస్తూ, తెలంగాణ అస్తిత్వాన్ని చాటిచెప్పే బతుకమ్మ పండుగ రాష్ట్ర ప్రజల ఐక్యతకు, మహిళల సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది.



Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com